తెలుగు దినపత్రిక

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice    వార్త పత్రిక

18-10-2026

ఆదివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 250

PUBLISHED FROM HYDERABAD    పేజీలు- 8    వెల:రూ.4 /–




## తెలంగాణకే ప్రత్యేకమైన పూల పండుగ

# బతుకమ్మ

పూలను ఓ ఆకారంగా పేర్చి దేవుడిగా పూజించడం అనేది ప్రపంచంలో ఎక్కడ కనిపించదు. ఒక్క తెలంగాణలో మాత్రం బతుకమ్మ పేరుతో పూలను పూజించే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. తెలంగాణలోని ప్రతీ ఆడపడుచు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే బతుకమ్మ పండుగ రానే వచ్చింది. యువతులు, ముత్తైదువులు ఆడుతూ పాడుతూ చూపరులను అలరించే అరుదైన వేడుక ఈ బతుకమ్మ పండగ. మహాలయ అమావాస్యతో ప్రారంభమై 9 రోజుల పాటు వైభవంగా సాగే ఈ పండగ శనివారం ప్రారంభంకానుంది.



## పంటకు సెలవన్న ప్రచారం..

# పల్లె గుండెను కదిలిస్తోంది!

### కన్నీటి ధారల సాగు.. పల్లెల్లో కరువు ఛాయలు

- ఎల్‌నినోతో అల్లాడిపోతున్న గ్రామీణ తెలంగాణ
- సాగునీరు, కరెంట్ కష్టాలతో అటకెక్కిన యాసంగి
- ఉపాధి లేక వలసల భయం
- ఎల్‌నినో ప్రభావంతో 18 జిల్లాల్లో 320 కరువు మండలాలు
- అడుగంటిన భూగర్భ జలాలు
- డెడ్ స్టోరేజ్‌కి చేరిన ప్రధాన రిజర్వాయర్లు
- విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరడంతో మోతెక్కిన వ్యవసాయ కరెంట్ కోతలు
- పంటలు చేతికొచ్చే వేళ కళ్లెదుటే ఎండిపోతున్న పైర్లు
- ప్రభుత్వం తక్షణమే ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 17 (సిరి న్యూస్)

'తెలంగాణ కోటి రతనాల వీణ' అని వర్ణించిన నేలపై నేడు వర్షాభావ పరిస్థితులు తీవ్ర విషాదాన్ని నింపుతున్నాయి. ఎల్‌నినో విలయం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో కరువు ఛాయలు అమ్ముమురుగా అలుముకుంటున్నాయి. యాసంగి సీజన్‌లో పంటలకు సెలవు ప్రకటించాలనే ప్రచారం పల్లె ప్రజల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైనే ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆధారపడి జీవిస్తున్న కోట్లాది మంది కర్షక కుటుంబాలకు రానున్న రోజులు అత్యంత కఠిన పరీక్షా సమయంగా మారుతున్నాయి. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షపాతం గణనీయంగా పడిపోవడంతో ప్రభుత్వం ఇప్పటికే 18 జిల్లాల్లోని 320 మండలాలను కరువు మండలాలుగా గుర్తించినప్పటికీ, క్షేత్రస్థాయిలో రైతులకు భరోసా కల్పించే కార్యాచరణ కొరవడిందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**అడుగంటిన జలాశయాలు..**

రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలు ఇప్పటికే నీటి మట్టాలు పడిపోయి డెడ్ స్టోరేజ్‌కు చేరువవుతున్నాయి.

మిగతా 2వ పేజీలో..

## పంటలు పూర్తయ్యే వరకు విద్యుత్ ఉద్యోగులకు సెలవులు రద్దు

- శాఖాపరమైన ఉత్తర్వులు జారీ!
- రైతులకు సాగునీటి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చూసేందుకు నిర్ణయం
- మరో నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండాలని స్పష్టీకరణ..



CIRCULAR

Sub: TGSPDCL – Administration – Restriction on sanction of leave until completion of CROPS – Instructions – Issued.

******

It is hereby informed that, in view of the importance and urgency of the ongoing **CROPS activities**, all employees of TGSPDCL, Sangareddy Circle are instructed to attend their duties regularly and ensure the timely completion of the assigned work.

In this regard, **no leave shall be sanctioned or entertained until completion of CROPS activities, except on genuine medical grounds**, subject to submission of valid medical documents and approval by the competent authority.

All Employees and Controlling Officers are hereby instructed to ensure strict compliance with these instructions and to make necessary arrangements for the uninterrupted execution and completion of CROPS activities within the stipulated time.

Any deviation from these instructions shall be viewed seriously.

These instructions shall come into force with immediate effect and remain in force until completion of CROPS activities or until further orders.

**This shall be treated as MOST URGENT.**

Superintending Engineer
Operation Circle, Sangareddy

To
The Divisional Engineer/Operations/Sangareddy, Patancheru, Jogipet & Zaheerabad.
The Divisional Engineer/Tech/CO/Sangareddy.
The Divisional Engineer/Transformers/Sangareddy.
The Divisional Engineer/M&P/Sangareddy.
The Divisional Engineer/DPE/Sangareddy
The Divisional Engineer/Construction/Sangareddy
The Executive Engineer/Civil/Sangareddy.
The Senior Accounts Officer/C.O/Sangareddy
The Accounts Officer (Expr)/C.O/Sangareddy
The Accounts Officer (Rev)/C.O/Sangareddy
The Asst. Divisional Engineer/Commercial/C.O/Sangareddy
The Asst. Accounts Officer/ERO/ Sangareddy, Patancheru, Jogipet, Zaheerabad & Sadashivpet.

2




## గోదావరి–కావేరి లింక్ తో రాష్ట్రానికి మరణ శాసనం

- బాబు కుట్రకు మద్దతు పలుకుతున్న రేవంత్
- తెలంగాణ ద్రోహులు మళ్లీ నిద్ర లేచారు
- తెలంగాణ నోట్లో మట్టికొడుతున్న 'చెయ్యి'!
- కావేరి ముసుగులో తెలంగాణ గొంతు కోస్తున్న బాబు
- దేవాదులలో పది మోటర్లు ఎందుకు నడపలేదు?
- నిప్పులు చెరిగిన హరీష్ రావు

3



## ఆడబిడ్డలకు సీఎం సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

- ఆడబిడ్డలకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి శుభాకాంక్షలు
- తెలంగాణ వైభవానికి, సంస్కృతికి ప్రతీక బతుకమ్మ
- సామాజిక న్యాయం, మహిళల ఐక్యతకు సంకేతం: భట్టి
- ఆడబిడ్డల సంక్షేమానికే ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం

3

## మత్తు పదార్థాలపై ఉక్కు పాదం

- డీజీపీ ఆనంద్
- రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా మోటార్ సైకిల్ ర్యాలీ




హైదరాబాద్, అక్టోబరు 17 సిరి న్యూస్ :

డ్రగ్స్ మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టి, యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీజీపీ సి.వి.ఆనంద్ పేర్కొన్నారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద ఆయన శనివారం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివాస్) సందర్భంగా సీఆర్పీఎఫ్ నోడల్ ఏజెన్సీగా

మిగతా 2వ పేజీలో..

## 315 మండలాల్లో కరువు పరిస్థితులు

- కేంద్రం తక్షణ సహాయం అందించాలి
- సూక్ష్మ సేద్యం, మధ్యంతర పంటల విత్తనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి
- 'ఖేత్ బచావో అభియాన'పై వీసీలో పాల్గొన్న మంత్రి తుమ్మల



హైదరాబాద్, అక్టోబర్ 17 సిరి న్యూస్:

వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలోని 315 మండలాల్లో కరువు తరహా పరిస్థితులు నెలకొంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర వ్యవసాయ,

మిగతా 2వ పేజీలో..



## ట్యాంక్‌బండ్‌పై నేడు పెద్ద బతుకమ్మ వేడుకలు

- మహిళలంతా వేడుకల్లో పాల్గొనాలి
- ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

2



## తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత

- ఎల్‌నినో ప్రభావం ఉన్నా నీటి ఎద్దడి రానివ్వం
- పక్కాగా ముందస్తు కార్యాచరణ అమలు
- 23న సింగూరు రిజర్వాయర్‌పై ప్రత్యేక సమావేశం
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క

2



## ఆడబిడ్డలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

2

## పల్లెబాట పట్టిన పట్నం!

- ఖాళీ అవుతున్న హైదరాబాద్ మహానగరం
- దసరా, బతుకమ్మ సంబురాల కోసం స్వగ్రామాలకు జన ప్రవాహం
- 7 వేల ప్రత్యేక బస్సులు, 200 రైళ్లు..
- టోల్‌ప్లాజాల వద్ద భారీ ట్రాఫిక్ జామ్!
- రద్దీని క్యాష్ చేసుకుంటూ ప్రైవేట్ ట్రావెల్స్, ఆర్టీసీ
- ప్రయాణికులపై విపరీతంగా పడుతున్న అదనపు ఆర్థిక భారం
- సజావుగా ప్రయాణాలు సాగేందుకు రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 17 (సిరి న్యూస్)

తెలంగాణ ప్రజల అతిపెద్ద పండుగలు బతుకమ్మ, దసరా సంబురాలు సమీపిస్తున్న తరుణంలో హైదరాబాద్ మహానగరం ఒక్కసారిగా ఖాళీ అవుతోంది. నిత్యం రద్దీగా ఉండే రోడ్లు, కూడళ్లు, బస్టాండ్లు ప్రస్తుతం బోసిపోయి కనిపిస్తుండగా, పల్లెలు మాత్రం స్వగ్రామాలకు చేరుకుంటున్న జనంతో కళకళలాడుతున్నాయి. తెలంగాణ వాసులతో పాటు వరుస సెలవులను పురస్కరించుకుని ఆంధ్రా ప్రాంత ప్రజలు సైతం

మిగతా 2వ పేజీలో..

# 315 మండలాల్లో కరువు పరిస్థితులు

**మొదటిపేజీ తరువాయి**

రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన' వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సూక్ష్మ సేద్యానికి, మధ్యంతర కాలంలో సాగు చేసే పంటలకు అవసరమైన విత్తనాల కోసం ప్రత్యేకంగా అదనపు బడ్జెట్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వాతావరణ పరిస్థితుల వల్ల రైతులకు ఎదురయ్యే నష్టాలను తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. తెలంగాణలో కూడా ఈ ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల 22 నుండి నవంబరు 30 వరకు నిర్వహిస్తామని, అఖిల భారత వ్యవసాయ సంస్థలు, విశ్వ విద్యాలయాల సిబ్బంది సహకారంతో వీటిని గ్రామాలలో నిర్వహిస్తామని తెలిపారు. పంటల పరిస్థితిని అంచనా వేయడం, అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించడం, పంటలు కోతకు వచ్చే వరకు వాటిని కాపాడేందుకు అవసరమైన సాగునీరు, విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని తమ ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఎరువుల ధరలు, సబ్సిడీల అంశాన్ని ప్రస్తావిస్తూ యూరియాపై అధిక సబ్సిడీ కారణంగా ఇతర ఎరువులతో పోలిస్తే దాని ధర తక్కువగా ఉందని, దీనివల్ల యూరియా అధిక వినియోగం పెరిగి నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని మంత్రి తెలిపారు. రైతులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించి, ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించాలని కోరారు. రైతులు పంటల మార్పిడికి ముందుకు రావాలంటే పంటలకు కనీస మద్దతు ధరపై కొనుగోలు భరోసా కల్పించడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న, జొన్న, పప్పుధాన్యాలు, నూనె గింజలు సహా అన్ని ప్రధాన పంటలను కనీస మద్దతు ధరపై 100 శాతం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. అలాగే ధరల మద్దతు పథకం (పీఎసఎస్) కింద ప్రస్తుతం అమలులో ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. వీబీ జీ రామ్‌జీ ప□థకం కింద నిధుల కేటాయింపును పెంచడంతోపాటు వ్యవసాయానికి సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా పొలాల్లో ఫామ్ పాండ్ల నిర్మాణం, నీటి సంరక్షణ, భూమి అభివృద్ధి పనులను ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే సరిపోదని, వారికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడంతోపాటు పండించిన పంటలకు మార్కెట్‌లో కొనుగోలు భరోసా కల్పించాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఆడబిడ్డలకు కేసీఆర్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్ 17 సిరి న్యూస్:**

రాష్ట్ర పండుగ బతుకమ్మ ముగింపు కార్యక్రమం సద్దుల బతుకమ్మ సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు బీఆరఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొమ్మిదిరోజుల పాటు ఆడబిడ్డల ఆటపాటలతో సాగిన బతుకమ్మ సంబురాలతో రాష్ట్రవ్యాప్తంగా సందడి నెలకొన్నదన్నారు. 'మల్లారావమ్మా బతుకమ్మా.. మా బతుకులు బాగు చేయవమ్మా' అని కోరుకుంటూ బతుకమ్మకు వీడ్కోలు పలుకుతూ ఘనమైన తెలంగాణ సాంస్కృతిక వేడుకలను ఆడబిడ్డలు ముగిస్తారని కేసీఆర్ తెలిపారు.

రాష్ట్ర సాధనలో, తెలంగాణ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం మహోన్నతమైనదని, వారి కృషిని, త్యాగాలను గుర్తించిన నాటి బీఆరఎస్ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. ఆడబిడ్డలకు ఎలాంటి కష్టం కలగకుండా చూస్తూ వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేయడం ద్వారానే బతుకమ్మ పండుగ స్ఫూర్తిని కొనసాగించిన వారమవుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

# ట్యాంక్‌బండ్‌పై నేడు పెద్ద బతుకమ్మ వేడుకలు

**హైదరాబాద్, అక్టోబర్ 17 సిరి న్యూస్:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆలోచనల మేరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పెద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని మహిళలందరికీ ఆమె ఆహ్వానం పలికారు. ఆడపడుచులందరికీ పేరుపేరునా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది ఒక పండుగేకాక తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని, ప్రజల జీవన విధానాన్ని, తరతరాలుగా కొనసాగుతున్న వారసత్వ సంపదను చాటిచెప్పే అరుదైన సాంస్కృతిక వేడుక అని అన్నారు. పూలతో చెరువులను శుద్ధి చేసుకుంటూ, ప్రకృతిని ఆరాధిస్తూ జరుపుకునే పండుగ బతుకమ్మ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సాధారణంగా పూలతో దేవుళ్లను పూజిస్తామని, కానీ పూలనే దేవతలుగా భావించి పూజించే ప్రత్యేకమైన సంప్రదాయం బతుకమ్మ పండుగలో కనిపిస్తుందని వివరించారు. నవధాన్యాలను ప్రసాదాలుగా పంచుకుంటూ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే సంప్రదాయం ఈ పండుగలో అంతర్భాగమన్నారు. ఆత్మీయత, అనురాగాలను కలబోసుకుని, కష్టసుఖాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ మహిళలంతా కలిసిమెలిసి జరుపుకునే పండుగ బతుకమ్మ అని సీతక్క తెలిపారు. ఈ వేడుక మహిళల్లో ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుందన్నారు. తరతరాలుగా మహిళలు తమ సంస్కృతిని, సంప్రదాయాలను తరువాతి తరాలకు అందిస్తున్నారని, బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ప్రత్యేకతకు, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. తొమ్మిది రోజులపాటు సాగే ఈ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మను ఆదివారం ఘనంగా జరుపుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పెద్ద బతుకమ్మ వేడుకలకు హైదరాబాద్‌లోని మహిళలందరూ తరలిరావాలని, పూల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆహ్వానించారు. మీ సీతక్కగా మీ అందరినీ బతుకమ్మ వేడుకలకు ఆహ్వానిస్తున్నాను.. తెలంగాణ ఆడపడుచులందరికీ స్వాగతం.. సుస్వాగతం అని అన్నారు.



# పల్లెబాట పట్టిన పట్నం!

**మొదటిపేజీ తరువాయి**

తమ సొంతూళ్లకు పయనమవడంతో భాగ్యనగరం ఒక్కసారిగా నిశ్శబ్ద నగరంగా మారిపోయింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, ప్రైవేట్ రవాణా రంగాలు ముమ్మర ఏర్పాట్లు చేసినప్పటికీ, జాతీయ రహదారులపై మాత్రం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది.

**పంతంగి వద్ద భారీగా జామ్**

స్వగ్రామాలకు వెళ్లేవారితో ప్రధాన రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై (ఎన్‌హెచ్ 65) వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్ పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ తారాస్థాయికి చేరింది. ఫాస్టాగ్ ఖాతాల్లో తగినంత బ్యాలెన్స్ లేకపోవడం, కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పాటు చౌటుప్పల్ పరిధిలో ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు జరుగుతుండటంతో వాహనాలు నెమ్మదిగా కదలాల్సి వస్తోంది. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లోని టోల్‌ప్లాజాల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ రద్దీని నియంత్రించేందుకు రాచకొండ మరియు నల్గొండ జిల్లా పోలీసులు అప్రమత్తమై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. అవసరమైన చోట లక్కారం నుంచి వలిగొండ మీదుగా చిట్యాల వైపు ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను మళ్లిస్తున్నారు.

**ప్రయాణికుల జేబులకు చిల్లులు**

పండుగ పూట సొంతూళ్లకు వెళ్లాలనుకునే సామాన్యులకు రవాణా ఛార్జీల రూపంలో పెనుభారం తప్పడం లేదు. ప్రయాణికుల విపరీతమైన రద్దీని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఇష్టానుసారంగా చార్జీలను పెంచేసి దోపిడీకి పాల్పడుతున్నాయి. మరోవైపు ఆర్టీసీ సైతం రద్దీని నియంత్రించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 వేల ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చినప్పటికీ, అదనపు చార్జీల మోత మోగిస్తోంది. ఎంజీబీఎస్, జెబీఎస్‌తో పాటు నగర శివారు ప్రాంతాల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతుండగా, రైల్వేశాఖ కూడా 200కు పైగా అదనపు ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. అయినప్పటికీ డిమాండ్‌కు సరిపడా సీట్లు దొరకకపోవడంతో ప్రజలు సొంత వాహనాల్లో



నూ భారీ సంఖ్యలో తరలివెళ్తున్నారు.

**పల్లెల్లో వెల్లివిరుస్తున్న పండుగ సందడి**

నగరాల నుంచి లక్షలాది మంది తమ కుటుంబాలతో కలిసి సొంతూళ్లకు చేరుకుంటుండటంతో గ్రామీణ ప్రాంతాలు పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి. బతుకమ్మ వేడుకల కోలాహలం, దసరా సంబరాల ఏర్పాట్లతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. ఏళ్ల తరబడి పట్టణాల్లో స్థిరపడిన బంధుమిత్రులు ఒక్కచోట చేరడం, పండుగ కొనుగోళ్లతో స్థానిక మార్కెట్లు కళకళలాడుతుండటం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి అద్దం పడుతోంది. అయితే, పండుగ ఉత్సాహంలో ప్రయాణాలు చేసే సమయంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, టోల్‌ప్లాజాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా ముందే ఫాస్టాగ్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలని, రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విద్యుత్ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా అడ్వైజరీ కమిటీని నియామకం

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 17 (సిరి న్యూస్)**

తెలంగాణ విద్యుత్ పునరుద్ధరణ ప్రక్రియలో భాగంగా అడ్వైజరీ కమిటీని నియమిస్తూ తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ సెక్రటరీ వి రాంచందర్ ఉత్తర్వులు జారీచేశారు. 21 మంది సభ్యులతో కూడిన అడ్వైజరీ కమిటీ పలు సంఘాల నేతలు, రైతు సంఘాల నేతలు ఉన్నారు. ఎన్ వేణుగోపాల్ రావు (జర్నలిస్టు), దొంతి నర్సింహారెడ్డి (స్వచ్ఛంద సంస్థ), శ్రీకుమార్ (స్వచ్ఛంద సంస్థ), వినోద్ కుమార్, రవీందర్ రాజు, అన్వేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజకిరణ్, శశిభూషణ్, సాయిబాబా (1104), ఇనుగాల శ్రీధర్ (ఐఎన్టియుసి), ఇంజేటి గోపినాథ్, పట్లోళ్ల శశిధర్ రెడ్డి (మాజీ శాసన సభ్యుడు), వి సుబ్బారెడ్డి, సుశీల్ సంచేటి, ఎచ్ కె గట్వారీ ( రైల్వే), వసంతపు వెంకటేశ్వర్లు (లఘు ఉద్యోగ భారతి), వీరభద్ర రావు, ప్రొఫెసర్ నర్సింహారెడ్డి (జేఎన్టియు మాజీ వైస్ ఛాన్సలర్), క్రాంతి కిరణ్ రెడ్డి, కిషోర్ బొర్రా లను సభ్యులుగా నియమింపబడ్డారు, ఈ అడ్వైజరీ కమిటీ మరో మూడేళ్ల పాటు కొనసాగితుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# పంటలు పూర్తయ్యే వరకు విద్యుత్ ఉద్యోగులకు సెలవులు రద్దు

**సంగారెడ్డి, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ పంపిణీ పరిస్థితులు, పంటల సాగును దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పంటలు చేతికి వచ్చే వరకు, వర్షాకాలం వ్యవసాయ సీజన్ పూర్తిగా ముగిసే వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులకు మరో నెల రోజుల పాటు సెలవులు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రైతన్నలకు సాగు విద్యుత్ సరఫరాలో ఎక్కడా ఎలాంటి అవాంతరాలు, అంతరాయాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం.. క్షేత్రస్థాయి సిబ్బందికి సాధారణ సెలవులు ఇవ్వబడవు. అత్యవసర పరిస్థితుల్లో సెలవు కావాలంటే నేరుగా అత్యున్నత అధికారిక అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు, ముఖ్యంగా అన్నదాతలకు నిరంతరం మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఉద్యోగులు మరో నెల పాటు విధుల్లో భాగంగా క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండాలని విద్యుత్ శాఖ ఆదేశించింది. ఇప్పటికే సంస్థ డైరెక్టర్లు, చీఫ్ ఇంజనీర్లు సైతం 'పొలం బాట' పట్టారు. గత వారం రోజుల నుంచే రైతుల ముంగిట అధికారులందరూ అందుబాటులో ఉండేలా స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. అందుకు అనుగుణంగానే అధికారులు కార్పొరేట్ కార్యాలయాలను వదిలి నేరుగా రైతుల పొలాల వద్దే దర్శనమిస్తూ విద్యుత్ సరఫరా తీరును పరిశీలిస్తున్నారు. పండగ వేళ ఈ తరహా సెలవుల రద్దు ఉత్తర్వులు సిబ్బందికి కొంత అసౌకర్యం కలిగిస్తున్నప్పటికీ.. కేవలం రైతు ప్రయోజనాలు, పంటల పరిరక్షణ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే, తీవ్రమైన ఆరోగ్య పరమైన సమస్యలు ఉన్నవారికి మరియు అత్యవసర ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కొంటున్న సిబ్బందికి ఈ ఆదేశాల నుంచి ప్రత్యేక మినహాయింపు ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# పంటకు సెలవన్న ప్రచారం..పల్లె గుండెను కదిలిస్తోంది!

**మొదటిపేజీ తరువాయి**

వర్షాకాలంలోనే సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే సగానికి పైగా తగ్గిపోగా, ఉన్న కొద్దిపాటి పంటలను కాపాడుకోవడానికి రైతులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నమ్ముకున్న బోరుబావులన్నీ ఒక్కొక్కటిగా వట్టిపోతున్నాయి. ఒకవైపు పంట పొట్టకొచ్చిన తరుణంలో నీరందక నెర్రెలుబారుతుంటే, మరోవైపు విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలు అన్నదాతలను తీవ్ర నిరాశలోకి నెడుతున్నాయి. గతంలో మాదిరిగా నిరంతర ఉచిత విద్యుత్ అందకపోవడం, కేవలం 7 నుంచి 10 గంటల మధ్యే కరెంట్ సరఫరా అవుతుండటంతో మోటార్లు పనిచేయక వేలాది ఎకరాల్లో పంటలు కళ్లెదుటే ఎండుముఖం పడుతున్నాయి.

**పల్లెల్లో మొదలైన వలసల భయం**

యాసంగిలో పంటలకు నీరు అందక పోతే వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోతాయి. ఇది కేవలం రైతులనే కాకుండా వారిపై ఆధారపడిన గీత కార్మికులు, చేనేత కార్మికులు, మంగళ్లు, చాకళ్లు, వ్యవసాయ కూలీలు, గ్రామాల్లోని చిరువ్యాపారుల జీవనోపాధిని ఛిన్నాభిన్నం చేస్తుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని దినాలను పెంచాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అది ఎంతవరకు ఆదుకుంటుందనేది ప్రశ్నార్థకమే. హైదరాబాద్ వంటి మహా నగరాల్లోనూ రియల్ రంగం మందగించడం వల్ల ఉపాధి కోసం వస్తున్న వారికి కూలీ పనులు కూడా సక్రమంగా దొరకని దయనీయ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పల్లెల్లో బతుకుదెరువు లేక కుటుంబాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి మునుపెన్నడూ లేనివిధంగా ముంచుకొస్తోంది.

**క్షేత్రస్థాయిలో విద్యుత్ సంక్షోభం**

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఆల్‌టైమ్ రికార్డులను బద్దలు కొడుతున్న తరుణంలో, డిస్కంలకు గ్రిడ్ నిర్వహణ పెద్ద సవాలుగా మారింది. సౌర విద్యుత్ మినహా జలవిద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోవడం, బొగ్గు కొరతతో థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడటంతో విద్యుత్ కొనుగోళ్లపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు వేయడంలో విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్న కొద్దిపాటి విద్యుత్‌ను కూడా సరిగ్గా సరఫరా చేయలేక అధికారులు నానా తంటాలు పడుతున్నారు. కనీసం వర్షాకాలపు పంటనైనా కాపాడాలనే లక్ష్యంతో అధికారులు పొలాల బాట పడుతున్నప్పటికీ, పడిపోతున్న వోల్టేజీ సమస్యలు, కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లతో రైతుల కష్టాలు తీరడం లేదు.

**ప్రభుత్వం నుంచి స్పష్టమైన కార్యాచరణ ఏది?**

ఎల్‌నినో ప్రభావాన్ని ముందే ఊహించి ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి యాజమాన్య పద్ధతులు, విద్యుత్ ప్రణాళికలపై ప్రభుత్వం మరింత వేగంగా స్పందించాల్సి ఉంది. కరువు మండలాల్లో రైతులకు ఆర్థిక భరోసా, పశువులకు దాణా, తాగునీటి సరఫరాపై తక్షణ చర్యలు చేపట్టాలి. కేవలం పంటలకు సెలవు అని ప్రకటించి చేతులు దులుపుకోకుండా, ఆ నష్టాన్ని పూడ్చేందుకు ప్రత్యేక సహాయక ప్యాకేజీలను ప్రకటించాలి. పల్లె గుండెల్లో నెలకొన్న ఈ ఆందోళనలను తొలగించి, అన్నదాతలకు అండగా నిలిచే సమగ్ర ప్రణాళికను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ప్రజలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

# తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత

**హైదరాబాద్, అక్టోబర్ 17:**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా రాష్ట్రంలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణను పకడ్బందీగా అమలు చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. మంచినీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ఎర్రమంజిల్‌లోని గ్రామీణ తాగునీటి సరఫరా కార్యాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి సీతక్క శనివారం సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్ల వారీగా నీటి నిల్వలు, ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితులు,్న వేసవిలో ఎదురయ్యే అవసరాలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

**తాగునీటికే మొదటి ప్రాధాన్యత**

నవంబర్ 1 లోపు సాగునీటి అవసరాలు తీరిన అనంతరం రిజర్వాయర్లలో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీ స్థాయికి చేరినా సరఫరాకు ఆటంకం కలగకుండా అత్యవసర పంపులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన పంపులను సమీకరించి కనీసం వంద పంపులను అందుబాటులో ఉంచాలని, పనిచేయని పంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు.

**గ్రామస్థాయి నుంచే వేసవి కార్యాచరణ**

రానున్న యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనిచ్చేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. నవంబర్ మొదటి వారంలో జిల్లా కలెక్టర్లతో కలిసి గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమీక్షలు నిర్వహించి వేసవి కార్యాచరణను వేగవంతం చేయాలన్నారు. రెండో వారంలో మండల స్థాయిలో తాగునీటి అవసరాలపై అవగాహన సదస్సులు నిర్వహించడంతోపాటు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, ప్రతి ఆవాస ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకుని హ్యాబిటేషన్‌ల వారీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, స్థానికంగా అందుబాటులో ఉన్న తాగునీటి వనరులను ముందుగానే గుర్తించి వినియోగానికి సిద్ధం చేయాలని చెప్పారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు బోర్‌వెల్ రీచార్జ్ పనులను పూర్తి చేయాలని, అవసరమైనచోట చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**పైప్‌లైన్ లీకేజీలపై నిర్లక్ష్యం వద్దు**

అందుబాటులో ఉన్న నీటిని ప్రతి చుక్కా విలువైనదిగా భావించి పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఇతర శాఖలు రోడ్డు మరమ్మతులు, నిర్మాణ పనులు చేపట్టే సమయంలో తాగునీటి పైప్‌లైన్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల కారణంగా పైప్‌లైన్లు దెబ్బతింటే సంబంధిత శాఖలే బాధ్యత వహించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైప్‌లైన్లు దెబ్బతిన్న సందర్భాల్లో వెంటనే మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణ, పైప్‌లైన్ మరమ్మతులకు అవసరమైన నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఇందుకోసం వీబీ జీ రామ్ జీ నిధులను ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

# గోదావరి–కావేరి లింక్ తో రాష్ట్రానికి మరణ శాసనం

**హైదరాబాద్, అక్టోబర్ 17:**

నవంబర్ 3న దిల్లీలో జరగనున్న ఎన్‌డబ్ల్యూడీఏ మీటింగ్ ఎజెండాలో గోదావరి కావేరి లింకును చేరుస్తూ రాష్ట్ర నీటి హక్కులకు మరణశాసనం రాస్తున్నారు. అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కుట్రకు మద్దతు పలుకుతూ చారిత్రక ద్రోహానికి పాల్పడుతున్నడని బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వెలిబుచ్చారు. తెలంగాణ భవన్లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ గోదావరి కావేరి లింకును పోలవరం నుంచి చేపట్టాలని, ఎజెండాలో చేర్చాలని చంద్రబాబు ఈనెల 7న లేఖ రాయగానే ఎజెండాలో పొందుపరిచి నవంబర్ 3న మీటింగ్ పెట్టారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం కుక్కిన పేనుల్లా పడి ఉన్న తెలంగాణ ద్రోహులంతా ఇవాళ మళ్ళా నిద్రలేచారు. పోలవరం బనకచర్ల లింకు ప్రాజెక్టుతో గోదావరి జలాలను అక్రమంగా ఆంధ్రకు తరలించేందుకు విష కూటమిలా తయారయ్యారు. తెలంగాణలో రేవంత్ సర్కార్ ఏర్పడిన మరుక్షణం నుంచే చంద్రబాబు గోదావరీ జలాల దోపిడీ మొదలు పెట్టిండని ఆరోపించారు. కోవర్టు రేవంతు తెలంగాణ నీటి హక్కులు నిండా ముంచుతున్నడు. గోదావరి జలాలను కొల్లగొట్టేందుకు ఏపీ సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తూనే ఉన్నారు.రాష్ట్ర ప్రభుత్వ మొద్దు నిద్రలో ఉంటే ఆ ఎత్తులను బిఆర్ఎస్ చిత్తు చేస్తూ వస్తున్నది. గోదావరిలో 200 టీఎంసీలు తీసుకుపోయేందుకు తొలుత పోలవరంబనకచర్లను తెరమీదికి తీసుకొచ్చారు. ఆ తర్వాత నల్లమలసాగర్‌గా పేరు మార్చారు. ఇప్పుడు కేంద్రంతో ఒప్పించి దానిని గోదావరికావేరి నదుల అనుసంధానం పేరిట బనకచర్లకు మార్గం సుగమం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. చంద్రబాబు ఇప్పుడు గోదావరి కావేరి ముసుగులో మూడో ప్రతిపాదనకు తీసుకువచ్చారు. నేరుగా పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జున సాగర్ సోమశిల ద్వారా కావేరికి నీళ్లు తరలించే ప్లాన్ చేసిండు. గోదావరి బనకచర్ల, గోదావరి నల్లమల సాగర్ ఫెయిల్ కావడంతో మొత్తం తెలంగాణ నదీ జలాలను కబలించే కుట్ర ఇది. అడ్డుకోవాల్సిన రేవంత్ రెడ్డి పూర్తిగా దాసోహం అంటున్నడు. పోలవరం నుంచి కావేరికి నేరుగా కలిపి అనుసంధానంలో తెలంగాణ లేకుండా చేసారు. కేసీఆర్ హెచ్చరించినట్టు 'కత్తి పరాయి వాడిదే కానీ..పొడిచే చెయ్యి' మనోడిదే! 'చెయ్యి' తెలంగాణ నోట్లో మట్టికొడుతున్నది.

**ఇది జాతి ద్రోహం**

'గురుదక్షిణ అని నువ్వు అనుకుంటున్నవు, కానీ ఇది అంతకు మించిన జాతి ద్రోహం. నువ్వు చేస్తున్న జల ద్రోహానికి భవిష్యత్ తరాలు కూడా నిన్ను క్షమించవు రేవంత్ రెడ్డి' అన్నారు. బనకచర్ల విషయంలో మేం అనేకసార్లు హెచ్చరించినం.. చంద్రబాబుతో జాగ్రత్తగా ఉండాలని చెప్పినం. మా గురువు మా గురువు అంటూ గోదావరి జలాలను వదలిపెట్టిండు. ఇప్పుడు అసలుకే ఎసరు వచ్చింది. ఈ రేవంత్ రెడ్డి.. ఇన్నాళ్లూ మనకు నీళ్లు ఉన్నా.. నీటి హక్కులు ఉన్నా వినియోగించలేదు. ఇప్పుడు ఏకంగా నీటి హక్కులే లేకుండా చేస్తున్నడు. ఇప్పటికే రిజర్వాయర్లలో నీటి నిల్వ లేదు, పంటలకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితి. ఎల్ నినో ఎఫెక్ట్ ఉంటుందని 9 నెలల నుంచి మొత్తుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైన రేవంత్ రెడ్డి నేడు ఎల్ ని నో పేరు చెప్పి చేతులెత్తేసిండు. రైతులు, ప్రజలను మీ సావు మీరు సావండి అంటున్నడు. ఇంక 'ఏదైనా కొనగలం కానీ నీళ్లను కొనలేం అంటున్నడు'. మరి అంతటి ప్రాధాన్యం గల నీళ్ల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నవు రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. దేవాదులలో నీళ్లు వస్తున్నయి. పది మోటార్లు నడవాల్సిన చోట మూడే ఎందుకు నడుపుతున్నావు అని నిలదీసినం. తెలంగాణ భవన్ లో మాట్లాడినం, వరంగల్ జిల్లాలో మాట్లాడినం. ఈరోజు పైసలు పెట్టి ఏదైనా కొనొచ్చు, నీళ్లు కొనలేం అంటున్నడు. దేవాదులలో పదికి పది మోటార్లు ఎందుకు నడపలేదు? అది చేసుంటే ఈరోజు వరంగల్ లో కరువు వచ్చేది కాదు కదా అన్నారు. ఏపీలో కరువు లేదు. తెలంగాణ కంటే తక్కువ వర్షపాతం ఏపీలో నమోదైంది. కానీ అక్కడ క్రాప్ హాలిడే లేదు, ఇక్కడ మాత్రం పంటలు వేయొద్దు అంటున్నవు. దేవాదులలో 10 మోటార్లు నడిపితే చెరువులు, చెక్ డ్యాంలు, రిజర్వాయర్లు నిండేవి కరువు ఉండేది కాదు. శ్రీశైలంలో నీళ్లు నిల్వ ఉన్నా లిఫ్ట్ చేయలేదు. 5 మోటార్లు ఉన్న కల్వకుర్తిలో 3 మోటార్లు 7,8 గంటలు నడిపావు. నువ్వు వదిలిపెడితే చంద్రబాబు 700 కి.మీ దూరంలో ఉన్న కుప్పానికి నీళ్లు తీసుకువెళ్లాడు. ఏపీలో జలహారతి, తెలంగాణలో కన్నీళ్ల హారతి. పాలమూరుకు, తెలంగాణకు కాలం తెచ్చిన కరువు కాదు, రేవంత్ తెచ్చిన కరువు. కన్నెపల్లిలో మోటార్లు నడపాలని డిమాండ్ చేస్తే నడపలేదు. ఎన్డీఎస్ఏ పేరు చెప్పి కాలయాపన చేసినవు అని హరీష్‌రావు ఆరోపించారు. నీళ్లు లిఫ్ట్ చేయడం రాష్ట్ర నిర్ణయం మాకు సంబంధం లేదు అని హైకోర్టులో ఎన్డీఎస్ఏ అఫిడవిట్ వేసి చెంప చెళ్లుమనేలా చెప్పింది. సిడబ్లుపిఆర్ఎస్ తన నివేదికలో అన్నారం, సుందిళ్ల అద్భుతంగా ఉన్నాయని చెప్పాయి. కన్నెపల్లిలో నీళ్లు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా, తెలంగాణకు, హైదరాబాద్ కు నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా రాజకీయాలు చేస్తూ లేని కరువు తెచ్చినవు రేవంత్ రెడ్డి. దేవాదుల, కన్నెపల్లి, కల్వకుర్తిలో 24 గంటల పాటు ఎందుకు మోటార్లు ఆన్ చేసి నీళ్లు ఎత్తలేదు. పంపుల వద్దకు అఖిలపక్షం తీసుకుపోదాం పదా? నీ ఫెయిల్యూర్ చూపిస్తా? ఎన్ని గంటలు నడిపినవు? ఎన్ని ఎత్తినవు తెలుస్తుంది అన్నారు. కల్వకుర్తిలో 35 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉంటే 13 టీఎంసీలు నడిపినవు. మిగిలిన నీళ్లు ఏపీకి దారాదత్తం చేసినవు. నేను రుజువు చేయడానికి రెడీగా ఉన్నా పోదాం పదా.

**మన్ను తిన్న పాము లెక్క ఉన్నవ్**

గోదావరి జలాలను తరలించుకుపోయే లింకు విషయంలో చంద్రబాబు లేఖల మీద లేఖలు రాస్తున్నడు. దిల్లీలో మీటింగులు అటెండ్ అవుతున్నడు. నువ్వు మన్ను తిన్న పాము లెక్క కదులవు మెదులవు. ఈనెల 7న చంద్రబాబు పాటిల్ కు లేఖ రాసిండు. ఆ లేఖ గోదావరిలో తెలంగాణ హక్కులకు మరణశాసనం. లేఖ మూడో పాయింట్: ''గోదావరి-కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుకు నీటిని మళ్లించే వనరుగా ఇచ్చంపల్లి లేదా సమ్మక్క సాగర్ ను గతంలో ఎన్డబ్ల్యుడీఏ ప్రతిపాదించింది.. ఈ ప్రతిపాదన ప్రకారం నీటిని డైవర్ట్ చేస్తే, ఆంధ్రప్రదేశ్ కు తీవ్ర నష్టం. ఎలాంటి లాభం లేదు. పోలవరం, ఇతర ప్రాజెక్టుల నీటి వినియోగంపై తీవ్ర ప్రభావం చూపుతుంద''ని లేఖలో రాసిండు.పదేళ్ల క్రితం జరిగిన నిర్ణయాన్ని ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారు.ఆనాడు బిఆర్ఎస్ ప్రతిపాదిస్తే ఇది సాధ్యం అయ్యింది.ఏ రాష్ట్రానికి ఎంత నీళ్లు అనేది ఆరోజు జరిగిన మీటింగ్ లో నిర్ణయించారు.గోదావరి పరివాహక ప్రాంతాలకు ఆ మెమరాండం కూడా పంపడం జరిగింది. తెలంగాణ నుంచి తీసుకుపోవాలని అన్ని రాష్ట్రాలు ఒప్పుకున్నయి.ఇచ్చంపల్లి నుంచి తీసుకుపోయేందుకు..

2024 జూన్ 10న జరిగిన మీటింగ్ లో మధ్యప్రదేశ్, 2024 జూన్ 11న జరిగిన మీటింగ్ లో తమిళనాడు, 2026 సెప్టెంబర్ 3న కర్ణాటక, పుదుచ్చేరిలు ఒప్పుకున్నాయి. కానీ చంద్రబాబు మాత్రం తెలంగాణకు ప్రయోజనం వద్దు అంటున్నడు.లేఖలో ఆరో పాయింట్: గోదావరి నుంచి తరలించిన నీటిని నేరుగా నాగార్జున సాగర్ రిజర్వాయర్ లోకి వదలడానికి బదులుగా, బొల్లపల్లి రిజర్వాయర్ ను వినియోగించాలని అంటడు. 150 టీఎంసీలు నింపుకుంట అంటడు.మరి తెలంగాణ హక్కులు ఏం కావాలి.సమక్క నుంచి నాగార్జున సాగర్ మీదుగా తీసుకువెళ్తే తెలంగాణకు నీళ్లు వస్తయి, కరువు వస్తే మనం వాడుకోవచ్చు. మనకు నీటి హక్కులు ఉంటయి.ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్ మీదుగా నదుల అనుసంధానం జరగాలని కేంద్రం ఒప్పుకున్నది. సరిహద్దు రాష్ట్రాలు ఒప్పుకున్నయి.మేము ముందు నుంచి ఒకటే చెబుతున్నాం. ఇచ్చంపల్లి కావేరీ లింకు విషయంలో.మా రాష్ట్రానికి 968టీఎంసీలకు మాకు అనుమతి ఇవ్వాలి, తీసుకుపోయే నీళ్లలో 50శాతం మాకు ఇవ్వాలి, మా నీళ్లు ఒక్క చుక్క ముట్టుకోకుండా ముందుకు వెళ్తే నదుల అనుసంధానంకు ఒప్పుకుంటామని స్పష్టంగా చెప్పినం.ఇప్పుడేం జరుగుతున్నది అసలు ఇచ్చంపల్లి వద్దు, పోలవరం మార్చాలి అంటున్నరు. నాగార్జున సాగర్ మీదుగా వద్దు బొల్లపల్లి తీసుకుపోతం అంటున్నరు.మనకు పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల పరిస్థితి ఏమిటి? 139 టీఎంసీలు పెండింగ్ లో ఉన్నయి. వార్ధా, సమ్మక్క, మూడో టీఎంసీలు కాంగ్రెస్ చేతగానితనం వల్ల వాపస్ చ్చింది.ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్ మీదుగా పోతే 2,38,236 ఎకరాలకు నీళ్లు అందుతాయి.ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సాగు నీళ్లు వస్తయి. ఇది ఆనాటి కేంద్రం ఎంఓయూలో నే స్పష్టంగా ఉంది. ఇప్పుడు ప్రతిపాదన మార్చితే తెలంగాణ పరిశ్రమలకు నీళ్లు, తాగు నీరు, సాగు నీరు పరిస్థితి ఏమిటి?మొదట ఉండే రాష్ట్రం తెలంగాణ మన వాటా మనకు రాకుండా చేస్తున్నారు.చంద్రబాబు లేఖ రాసి పది రోజులు అవుతున్నా నీకు సోయి రాదు పెదవి విప్పవు.అసలు ఇంటర్ లింకింగ్ నుంచి సమ్మక్క సాగర్ ను ఎందుకు తీసేస్తున్నరు.గతంలో సమ్మక్క సాగర్ కు 45 టీఎంసీ అనుమతి ఇవ్వొద్దు, మా పోలవరంకు నష్టం అవుతుంది అని ఏపీ లేఖ రాసింది. వాళ్లు వెంటనే డీపీఆర్ వాపస్ పంపారు.లేఖలో గోదావరి కావేరీ లింకు విన్ విన్ సిట్యుయేషన్ అంటున్న చంద్రబాబు గారు..ఏ విధంగా విన్ విన్ సిట్యుయేషన్ అవుతుంది చంద్రబాబు చెబుతారా? రేవంత్ చెబుతారా? కేంద్రం చెబుతుందా ?తెలంగాణకు నష్టం చేసే ఈ ప్రతిపాదన ఎలా విన్ విన్ సిట్యుయేషన్ అవుతుందని ప్రశ్నించారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మొన్న ఏపీకి వచ్చిండు.చేయి చేయి కలుపుదాం దక్షిణాదికి మేలు చేసుకుందాం అని మాట్లాడుకున్నరు.అసలు ఏం జరుగుతుందో తెలుసా రేవంత్ రెడ్డి.కర్ణాటకను ఒప్పించేందుకు చంద్రబాబు ఆఫర్ ఇచ్చిండు.

మేము కింద గోదావరి నీళ్లు వాడుకుంటం, పైన ఆల్మట్టిలో 16 టీఎంసీలు ఆపుకో.కానీ పోలవరం లింకుకు ఒప్పుకో అంటున్నడు. అల్రెడీ పోలవరం డైవర్షన్ లో 21 టీఎంసీలు, ఇప్పుడు 16 టీఎంసీలు అంటే 37 టీఎంసీలు కృష్ణాలో ఆగితే పాలమూరు జిల్లాకు నష్టం. ఎల్ నినో నేపథ్యంలో నీళ్ల ప్రాధాన్యం అర్థమైన తర్వాత ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఎందుకు నోరు మెదపడం లేదు? తెలంగాణ శాశ్వతంరాష్ట్ర హక్కులను కాలరాసే హక్కు నీకు లేదు రేవంత్ రెడ్డి.జాతీయ ప్రయోజనాలు అంటే ఒక రాష్ట్రానికి మేలు జరగటం కాదు. ఇచ్చంపల్లి నుంచి లింకు ప్రాజెక్టు వెళ్తే అన్ని రాష్ట్రాలకు ఉపయోగం.కానీ కేంద్రం ఏం చేస్తున్నది. చంద్రబాబు ఏం చెబితే అదే చేస్తారా 16 మంది ఎంపీలు ఉండి గడ్డి పీకుతున్నారా.ఈ ప్రతిపాదన కేంద్రం ఒప్పుకుంటే తెలంగాణ జాతికిశ్వాశ్వతంగా ద్రోహం చేసినట్లేరేవంత్ రెడ్డి ఎందుకు మౌనం? మీ మధ్య ఉన్న ఒప్పందం ఏమిటి.రేవంత్ గురు దక్షిణ చెల్లిస్తుంటే, బిజేపీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు తెలంగాణ హక్కులను కాపాడే బాధ్యత లేదా? కేఎల్ రావు గొప్పవారు అని ఏపీ వాళ్లు కీర్తిస్తారు. ఆ కేఎల్ రావే గోదావరి కావేరి లింకు ఇచ్చంపల్లి మీదుగా తీసుకుపోవాలని చెప్పారు. వారు చెప్పినా వినరా? ఏపీ ప్రయోజనాలే దేశ ప్రయోజనాలు అవుతాయా?చంద్రబాబు ఎంపీలను చేతిలో పెట్టుకొని ఆడిస్తే కేంద్రం ఆడుతుందా? తెలంగాణ జాతికి మోసం చేస్తాం అంటే తెలంగాణ ప్రజలు ఊరుకోరు. ఊరుకునే గడ్డ కాదు, ఎలాంటి పోరాటానికైనా సిద్ధం. ఈ ప్రతిపాదనలు వెంటనే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేస్తున్నాం.

**సర్ ప్లస్ వాటర్ మీద ప్రాజెక్టు అనుమతించరు**

సర్ ప్లస్ వాటర్ ఉందంటున్న చంద్రబాబు అసలు సర్ ప్లస్ వాటర్ ఎంతుంది, తెలంగాణ వాటా ఎంత అది తేలకుండా వాడుకుంటాం అంటే ఏమన్నట్లు? తెలంగాణ పరిస్థితి ఏమిటి? సర్ ప్లస్ వాటర్ మీద ప్రాజెక్టు అనుమతించరు. అసలు గోదావరి కావేరి నీళ్లు ఎక్కడివి అంటే.. చత్తీస్ గడ్ వినియోగించని 148 టీఎంసీలు. వీటిని గోదావరి కావేరీ లింకుకు వాడుతం అన్నరు.ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 148 టీఎంసీలను మళ్లించాలనే లక్ష్యంతో ఎన్డబ్ల్యుడీఏ గోదావరి కావేరి లింకు ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది.ఈ మళ్లించే 148 టీఎంసీల జలాల్లో తెలంగాణకు 43, ఏపీకి 44, తమిళనాడుకు 42.5, పుదుచ్చేరికి 2.5, కర్ణాటకకి 16 టీఎంసీలను పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నీళ్లన్నీ నువ్వే తీసుకుపోతే తెలంగాణ ఏం కావాలి. నేషనల్ ప్రాజెక్టు అంటున్నరు. మాకు నష్టం చేసేది నేషనల్ ప్రాజెక్టు ఎలా అవుతుంది? కాళేశ్వరం, పాలమూరు నేషనల్ ప్రాజెక్టు అడిగితే మాకు ఇవ్వలేదు.తెలంగాణకు ఒక్క నేషనల్ ప్రాజెక్టు వద్దా? కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కోవాలి. రేవంత్ నోరు విప్పాలి. నిజమైన కాంగ్రెస్ నాయకులారా.. తెలంగాణ గడ్డకు పచ్చ కాంగ్రెస్ చేస్తున్న ద్రోహాన్ని ఇప్పటికైనా అడ్డుకోండి.ఇకనైనా బాబుకు చేసే బానిసత్వం మానుకోవాలనీ, తెలంగాణ హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం.లేదంటే కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్ళతో పెకలిస్తాం, బిజేపీకి బుద్ది చెబుతాం అని హెచ్చరిస్తున్నాం. సమావేశంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.




# నిరుద్యోగులను నిండా ముంచిన ప్రభుత్వం

- **25వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీ**
- **కేవలం 7వేల పోస్టుల భర్తీకే నోటిఫికేషన్**
- **ఆరకొర పోస్టుల భర్తీ నోటిఫికేషన్తో ఏం ప్రయోజనం**
- **బీఆర్ఎస్ నేత హరీష్‌రావు విమర్శ**



**హైదరాబాద్, అక్టోబర్ 17 సిరి న్యూస్:**

కాంగ్రెస్ ప్రభుత్వం తమను నిలువునా ముంచిందని, తమ ఆశలపై నీళ్లు చల్లిందని పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాదిమంది నిరుద్యోగ యువత ఆవేదన వ్యక్తం చేస్తుంటే ఈ ప్రభుత్వానికి కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటని హరీష్రావు విమర్శించారు. హైదరాబాద్ లోని తన నివాసంలో శనివారం కలిసి వినతి పత్రం అందించిన పోలీస్ ఉద్యోగ అభ్యర్థులు, నిరుద్యోగులనుంచి వినతిపత్రం స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగాల జాతర అంటూ నిరుద్యోగుల్లో ఆశలు రేపి ఓట్లు వేయించుకుని ఇప్పుడు నామమాత్రంగా పోస్టులు ప్రకటించడం అంటే యువతకు ద్రోహం చేయడమేనన్నారు. కేవలం ఏడు వేల పోస్టులతో కూడిన నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న లక్షలాదిమంది ఉద్యోగ అభ్యర్థులకు ఏ విధంగా న్యాయం చేస్తారు? జాబ్ క్యాలెండర్‌ను జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మార్చేశారు. అరకొర పోస్టులతో కూడిన నోటిఫికేషన్లు ఇచ్చి నిరుద్యోగ యువతను మభ్యపెడుతున్నారు.తాజా కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులకు సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులు ఒక్కటి కూడా కేటాయించలేదు.చార్మినార్ జోన్ పరిధిలో సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులు తగిన సంఖ్యలో లేకపోవడం వల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.పెరుగుతున్న నగర జనాభా, విస్తరిస్తున్న ఐటీ కారిడార్లు, పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధికి అనుగుణంగా శాంతిభద్రతల పరిరక్షణకు అదనపు పోలీసు బలగాలు అత్యవసరం. అయినా ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని విస్మరించి నిరుద్యోగులను మోసం చేసింద అరకొర పోస్టులతో కూడిన నోటిఫికేషన్ నిరుద్యోగుల ఆకాంక్షలను ఏమాత్రం నెరవేర్చలేదు అన్నది సుస్పష్టం. హోంమంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. పోలీస్ ఉద్యోగాల అభ్యర్థుల అవేదన అర్థం చేసుకోవాలన్నారు. పోలీసు ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో వేలాది మంది యువత తమ సమయాన్ని, శ్రమను, ఆర్థిక వనరులను వెచ్చిస్తున్నారు. వారి ఆశలను, ఆకాంక్షలను గౌరవించండి.పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని, హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఫ్యూచర్ సిటీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు పోస్టులు కేటాయించి నియామకాలు చేపట్టాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ఆడబిడ్డలకు సీఎం సద్దుల
# బతుకమ్మ శుభాకాంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్ 17 సిరి న్యూస్:**

సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రతీక, ప్రకృతి, ఆడబిడ్డల ఆరాధనకు బతుకమ్మ పండగ నిలువెత్తు నిదర్శనమన్నారు. ప్రకృతి, పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు మన తెలంగాణ అని రు. తీరొక్క పూలతో చేసిన, ఘనమైన బతుకమ్మలతో ఆడ బిడ్డలందరూ ఆటపాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ పూల పండుగ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలని, ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని, తెలంగాణ సంస్కృతి వైభవం తరతరాలపాటు నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతోపాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. రాష్ట్రమంతా బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రజా ప్రభుత్వం అందజేస్తూ ముందుకు సాగుతున్నదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

**సామాజిక న్యాయం, సమానత్వానికి ప్రతీక**
**ప్రజలకు, ఆడబిడ్డలకు ఉప ముఖ్యమంత్రి**
**భట్టి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు**

హైదరాబాద్, అక్టోబర్ 17 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సామాజిక న్యాయం, సమానత్వం, మహిళల ఐక్యతకు ప్రతిరూపమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, ప్రత్యేకించి ఆడబిడ్డలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పూల పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ ఆత్మకు ప్రతిరూపమని పేర్కొన్నారు. వివిధ రకాల పూలు, రంగులు, సువాసనలు కలిసి అందమైన బతుకమ్మగా రూపుదిద్దుకున్నట్లే భిన్న వర్గాలు, విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలకు చెందిన ప్రజలను ఈ పండుగ ఒక్కతాటిపైకి తీసుకువస్తుందని వివరించారు. సమాజంలోని వైవిధ్యాన్ని గౌరవిస్తూ ఐకమత్యాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. ప్రకృతిని, పూలను ఆరాధించే విశిష్టమైన సంస్కృతికి తెలంగాణ నెలవని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రకృతితో మమేకమవుతూ మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మను పేర్చి ఆటపాటలతో సంబురాలు జరుపుకోవడం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనమన్నారు. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఆడబిడ్డల సంక్షేమం, అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల జీవన విధానాన్ని, మహిళల ఆత్మగౌరవాన్ని, ప్రకృతిపై వారికున్న ఆరాధనా భావాన్ని ప్రతిబింబిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా ఆనందాల పూలవాన కురిపించాలని,ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం తరతరాలపాటు కొనసాగాలని, బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, సామాజిక సామరస్యానికి మరింత బలాన్నివ్వాలని అభిలషించారు.

## ఆహ్వానాలపై ప్రత్యేక
# దృష్టి సారించాలి

**హైదరాబాద్, అక్టోబర్ 17 సిరి న్యూస్:**



తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లక్ష్యాల సాధనకు దోహదపడేలా ప్రముఖ పారిశ్రామిక ప్రతినిధులు, ఆయా రంగాల నిపుణులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులకు సూచించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై సచివాలయంలో శనివారం ఆయన సమీక్షించారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమ సన్నాహాలు, ముఖ్యంగా కీలక భాగస్వాములకు ఆహ్వానాలు పంపడం, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడటంపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశంలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించి, అలాగే దానికి ముందస్తు కార్యక్రమాలుగా హైదరాబాద్‌లో ఈ నెల 24న, 29న న్యూఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమాలకు ఆహ్వానాల పంపిణీ స్థితిగతులను సీఎస్ సమీక్షించారు. ఈ రెండు కార్యక్రమాలకు ఆహ్వానాలు పంపించినట్లు అధికారులు ఆయనకు వివరించారు. ఏరోస్పేస్, అంతరిక్షం, రక్షణ రంగాలకు చెందిన సంబంధిత భాగస్వాములందరినీ ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆహ్వానించాలని ప్రధాన కార్యదర్శి సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ దేశాల రాయబారులతోపాటు, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఐసీసీఐ), అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచమ్), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) వంటి ప్రముఖ పారిశ్రామిక సంఘాల ప్రతినిధులను, ఇతర రంగాల ప్రముఖులను కూడా ఆహ్వానించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని తమ బాధ్యతగా భావించి సంబంధిత భాగస్వాములతో సమన్వయం చేసుకుంటూ ఆహ్వానితుల భాగస్వామ్యాన్ని నిర్ధారించేందుకు సమష్టి కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్, దిల్లీలలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాలు నిర్దేశిత లక్ష్యాలను సాధించడంతోపాటు పారిశ్రామికరంగ ప్రముఖులు, అంతర్జాతీయ ప్రతినిధులు, ఇతర కీలక భాగస్వాముల మధ్య ఆశించిన స్థాయిలో పరస్పర భాగస్వామ్యం, చర్చలు జరిగేలా సూక్ష్మస్థాయి ప్రణాళికలు, సమర్థవంతమైన సమన్వయం అవసరమని ఆయన పునరుద్ఘాటించారు.

# అమర పోలీసుల స్ఫూర్తితో 157మంది రక్తదానం

**హైదరాబాద్, అక్టోబర్ 17 సిరి న్యూస్:**

పోలీసు స్మారక వారోత్సవాల సందర్భంగా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలకు చెందిన 157మంది పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. హైదరాబాద్‌లోని గ్రేహౌండ్స్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో కమాండోలు, సీనియర్ అధికారులు, ప్రొబేషనరీ డీఎస్పీలు పాల్గొన్నారు. ప్రజాసేవతోపాటు ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలోనూ ముందుంటామని పోలీసులు ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. గ్రేహౌండ్స్‌లో మూడు వారాలపాటు 'జంగిల్ ఆపరేషన్స్ అండ్ సర్వైవల్ టాక్టిక్స్'లో శిక్షణ పొందుతున్న 30మంది ప్రొబేషనరీ డీఎస్పీలు సైతం రక్తదానం చేశారు. తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల డీజీపీ (ఆపరేషన్స్) డాక్టర్ అనిల్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొని రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్లు ఎండీ అష్ఫాక్, ఎ. వెంకటేశ్వర్లు, పి.వి. నారాయణస్వామి, స్క్వాడ్రన్ కమాండర్లు బి.శంకరయ్య, జి.రాజు, ఆక్టోపస్ అదనపు ఎస్పీ సీహెచ్.రఘునందన్‌రావు, గ్రేహౌండ్స్ వైద్యాధికారులు డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పి.మంజురెడ్డి, ఆక్టోపస్ వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు.



## రాష్ట్ర కమిటీ లో జిన్నారం మండలం నుండి 4 గురికి కీలక బాధ్యతలు





**పటాన్ చెరు/జిన్నారం, అక్టోబర్ 17, (సిరి న్యూస్):**

పి ఆర్ టీ యు టీ ఎస్ సంఘం రాష్ట్ర కమిటీలో జిన్నారం మండలం నుండి నలుగురు ఉపాధ్యాయుల కి కీలక పదవులు దక్కాయి. కొడకంచి ఉన్నత పాఠశాల లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మొగులయ్య, ఇదే మండలం వావిలాల్ హై స్కూల్ లో పని చేస్తున్న బ్రహ్మ రుషి లను రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గా నియించారు. అలాగే మాదారం హై స్కూల్ లో స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్ష లు గా, బొల్లారం హై స్కూల్ లో పని చేస్తున్న త్రిశూల నాథ్ లను కార్యదర్శి గా నియమించారు. రాష్ట్ర కమిటీలో జిన్నారం మండలం నుండి నలుగురికి చోటు కల్పించడం పట్ల మండల శాఖ అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి పవన్ రాజ్ లు రాష్ట్ర, జిల్లా సంఘం బాధ్యులకు కృతజ్ఞతలు తెలియ జేశారు.





## అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన కోణం విఠల్



**పెద్ద శంకరం పేట, అక్టోబర్ 17, (సిరి న్యూస్):**

పెద్ద శంకరం పేట పట్టణం గడి కోటలో శ్రీ మహాలక్ష్మి అవతారంలో వెలసిన అమ్మ వారిని సంగారెడ్డి జిల్లా బి జె పి ఓబీసీ విభాగం అధ్యక్షుడు కోణం విఠల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను గడికోట ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చిరు సన్మానం చేశారు.

## కవిత ల పోటీ లో ప్రతిభ



**పటాన్ చెరు, అక్టోబర్ 17 , (తెలంగాణ వాణి):**

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ , తెలుగు భాషా చైతన్య సమితి, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ దసరా సంబరాలు సందర్భంగా శనివారం రవీంద్ర భారతి హైదరాబాద్ లో కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న జిన్నారం మండల పరిధిలోని కొడుకంచి హై స్కూల్ తెలుగు భాష ఉపాధ్యాయులు మొగిలి మాల పాల్గొని శమీ శమయతే పాపం ! శమీ శత్రు వినాశనం అనే శీర్షికతో చక్కని కవిత చదివి వినిపించారు. నిర్వాహకులు ఆయనను శాలువ, జ్ఞాపిక తో సత్కరించారు.

## పి ఆర్ టీ యు టీ ఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు గా కోక రజిత

**పటాన్ చెరు/ రామ చంద్ర పురం, అక్టోబర్ 17, (సిరి న్యూస్)**



పి ఆర్ టీ యు టీ ఎస్ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు గా కోక రజిత ఎన్నికయ్యారు. రజిత సెకండరీ గ్రేడ్ టీచర్ గా ఎం పీ పి ఎస్ రంగనాథ పురం స్కూల్ లో పని చేస్తున్నారు. గురు, శుక్రవారం నల్గొండ లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో సంగారెడ్డి జిల్లా రామ చంద్ర పురం మండలం నుండి రాష్ట్ర కార్యవర్గంలో అసోసియేట్స్ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నందుకు కోక రజిత రాష్ట్ర అధ్యక్షులు బిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి కి జిల్లా అధ్యక్షులు ఆకుల మానెయ్య, ప్రధాన కార్యదర్శి విఠల్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు తులసీరామ్ రాథోడ్ కి, మండల అధ్యక్షులు అశోక్ రెడ్డి కి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి కి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## తుల్జాపూర్ భవాని మాతకు ప్రత్యేక పూజలు చేసిన పిఎంఆర్ దంపతులు

- **ప్రతి సంవత్సరం మాదిరిగానే తుల్జాపూర్ లో అన్నదాన కార్యక్రమం.**
- **అనావృష్టి నుండి ప్రజలను ఆదుకోమ్మా.**
- **పులిమామిడి మమతా రాజు.**

**సదాశివపేట. అక్టోబర్ 17. (సిరిన్యూస్)**



సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు తుల్జాపూర్‌లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన పులిమామిడి రాజు దేవి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తుల్జాపూర్‌లో కొలువుదీరిన శ్రీ తుల్జా భవాని అమ్మవారిని సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు, ఆయన సతీమణి, సదాశివపేట 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పండితులు రోహిత్ కదం పరమేశ్వర్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, గోందళం, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తుల్జాపూర్‌కు విచ్చేసిన భక్తుల కోసం పులిమామిడి రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరిపై తుల్జా భవాని అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో రైతులు పంటల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో నీటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు వెల్లడించారు. రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, పాడిపంటలతో గ్రామీణ ప్రాంతాలు కళకళలాడాలని, సమయానికి తగిన వర్షాలు కురిసి నీటి సమస్యలు తొలగిపోవాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని తుల్జా భవాని అమ్మవారిని వేడుకున్నట్లు పులిమామిడి రాజు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భక్తులకు సహాయం చేయడం సంతోషంగా ఉందని, భక్తి భావంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి రాజు మిత్రులు నర్సింలు, తాలెల్మ రాము, సోమ శంకర్, పీఎంఆర్ యువసేన నాయకులు, వారి కుటుంబ సభ్యులు గాండ్ల పద్మ, మనోజ్, మాధవి, రాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఫామ్ పాండ్లతో బహుళ ప్రయోజనాలు

- **ఎల్ నీ నో ను ఎదుర్కోవాలంటే భూగర్భ జలాల పరిరక్షించాలి**
- **నిబంధనల ప్రకారం ఫామ్ పాండ్ల కమ్యూనిటీ సోక్ పిట్స్, నిర్మాణాలు చేపట్టాలి**
- **వీబీ–జీ రామ్ జీ పథకం కింద పనులు వేగవంతం చేయాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**పాపన్నపేట్ అక్టోబర్ 17 సిరి న్యూస్ :**



శనివారం పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో వి బి జి రామ్ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ పంటల సాగుకు నీటి కొరత లేకుండా, వర్షపు నీటిని ఒడిసిపట్టి అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకునేందుకు చేపడుతున్న ఫామ్ పాండ్ల నిర్మాణం,సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం, జలసిరి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫామ్ పాండ్ల నిర్మాణ పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత లోతు, ఎత్తు, పొడవులతో ఫామ్ పాండ్ల నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలంలో,ప్రతీ గ్రామ పంచాయతీ లో ఐదు ఫామ్ పాండ్ల చొప్పున ఎంపిక చేసి, వాటి నిర్మాణ పనులను క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. నిర్మాణ పనులకు ప్రతిరోజూ ఎంత మంది కూలీలు హాజరవుతున్నారు, వారికి ఎంత మేర కూలి చెల్లిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీల హాజరును తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు, సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో భూగర్భ జల మట్టాల పెంపు, నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వీబీ-జీ రామ్ జీ పథకం కింద అవసరమైన పనులను గుర్తించి, చేపట్టాలని సూచించారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, మరమ్మతులు, ఇతర నీటి సంరక్షణ పనులకు సంబంధించి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు,ఎంపీడీవో విష్ణువర్ధన్ తాహసిల్దార్ సతీష్ గ్రామ మాజీ సర్పంచ్ జగన్ పాల్గొన్నారు.

## గోవింద నామ స్మరణం కళ్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవం





- **వైభవంగా ముగిసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు**
- **చక్రస్నానం, మహా పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు**
- **అశ్వవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారి ఊరేగింపు**

**గుమ్మడిదల, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

మున్సిపాలిటీ కేంద్రం గుమ్మడిదలలోని శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా శుక్రవారంతో ముగిశాయి. భక్తిశ్రద్ధలతో కొనసాగిన ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ప్రత్యేక పూజలు, చక్రస్నానం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వంశపారంపర్య ధర్మకర్తల సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణలతో మార్మోగింది.

**అశ్వవాహనంపై స్వామివారి సేవా**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి అశ్వవాహన సేవాపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గ్రామంలోని ప్రధాన పురవీధుల గుండా సాగింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వీధుల వెంట బారులు తీరారు. మహిళలు ఇళ్ల ముందు మంగళహారతులు సమర్పిస్తూ స్వామివారికి భక్తిపూర్వకంగా స్వాగతం పలికారు. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అశ్వవాహనంపై స్వామివారి దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

**భక్తిపారవశ్యంలో గ్రామ పురవీధులు**

స్వామివారి సేవా సందర్భంగా గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి ఊరేగింపు సాగినంతసేపు భక్తుల జయజయధ్వానాలు, గోవింద నామస్మరణలతో పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వాహన సేవలో గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందారు.

**చక్రస్నానం, మహా పూర్ణాహుతితో సంపూర్ణత**

బ్రహ్మోత్సవాల చివరి రోజున అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి చక్రస్నాన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలకు సంపూర్ణత చేకూరింది. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ జరిగిన ఈ కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

**ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు**

ఆలయ కమిటీ అధ్యక్షుడు బాల్ రెడ్డి, కమిటీ సభ్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు నరసింహ చార్యులు, రంగనాథ చార్యులు , గ్రామ ప్రజల సహకారంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు, వాహన సేవలు నిర్వహించడంతో భక్తులు విశేషంగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తిశ్రద్ధలు, సంప్రదాయబద్ధమైన పూజలు, వైభవోపేతమైన వాహన సేవలతో గుమ్మడిదలలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా ముగిశాయి.

## ఉద్యోగుల గోడు పట్టదా?.. 23 ఏళ్ల నిరీక్షణ!..

- **23 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో సేవలు..**
- **నస్పూర్ కలెక్టరేట్ ఎదుట ఐదు రోజులుగా దీక్ష..**
- **17 వేల మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి..**
- **సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి డిమాండ్..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 (సిరి న్యూస్)**




23 ఏళ్లుగా సేవలందిస్తున్నా కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతకు నోచుకోని జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల పోరాటానికి ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. నస్పూర్ కలెక్టరేట్ ఎదుట ఐదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఉద్యోగులను క్రమబద్ధీకరించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 78 విభాగాల్లో పనిచేస్తున్న 17 వేల మంది ఉద్యోగులు రెండు దశాబ్దాలకు పైగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని విమర్శించారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన ఉద్యోగుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రజారోగ్య వ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న ఉద్యోగులను నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆశయాలకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని నాయకులు ప్రకటించారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, వారి ఉద్యమానికి జిల్లా కమిటీ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గద్దల బానయ్య మాదిగ, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు జలంపల్లి శ్రీనివాస్ మాదిగ, సీనియర్ నాయకులు గాలిపెల్లి సత్యనారాయణ మాదిగ, నస్పూర్ మండల అధ్యక్షులు బచ్చలి రమేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి కోయ్యల శేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# SGT ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వినతి

- **రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం**

**వెల్దుర్తి,అక్టోబర్ 17,(సిరి న్యూస్):**

శనివారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి SGTU తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం కలిసి, రాష్ట్రంలోని SGT ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్యారంగాన్ని



బలోపేతం చేయడంతో పాటు, ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యాబోధనను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అనుకూల పరిస్థితులు కల్పించాలని కోరారు. ముఖ్యంగా GO No.25 వల్ల ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుతో ఎదురవుతున్న సమస్యలను సమీక్షించి, విద్యార్థుల అభ్యసన ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తగిన సవరణలు చేపట్టాలని కోరారు. ప్రతి తరగతికి తగినంత మంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరారు. ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యంగా SGTU తెలంగాణ నిరంతరం ఉపాధ్యాయుల హక్కుల కోసం, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం కృషి చేస్తోందని వివరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# సాయిరాం కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

- **బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి –**
- **నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**నర్సాపూర్ అక్టోబర్ 17 (సిరి న్యూస్)**

నర్సాపూర్ పట్టణంలో ఒక రెస్టారెంట్ లో తిని ఫుడ్ పాయిజన్ తో మృతి చెందిన సాయిరాం కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఫుడ్ పాయిజన్‌తో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరామర్శించారు.బాధితుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగితెలుసుకున్నారు.బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.ఫుడ్ పాయిజన్ ఘటనలో మృతి చెందిన సాయిరాం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా, విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. వివిధ కారణాల తో మృతి చెందిన రైతుల కుటుంబాలనుఆదుకునేందుకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఫుడ్



పాయిజన్ బాధితులకు మెరుగైన వైద్యం, మృతుడి కుటుంబానికి పరిహారం, రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

# పేటలో న్యాయమూర్తి చేత చట్టాలపై అవగాహన

**పెద్ద శంకరంపేట, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

సామాన్య ప్రజలు తమకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంచుకోవడం చాలా అవసరమని అల్లాదుర్గం మున్సిపల్ కోర్టు న్యాయమూర్తి సుచరిత అన్నారు. చట్టపరిజ్ఞానం ఉన్న ప్రతి వ్యక్తి తన హక్కులను సమర్థవంతంగా కాపాడుకోగలడని, అలాగే సమస్యలను న్యాయపరమైన మార్గంలోనే పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. శనివారం పెద్ద శంకరంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి సుచరిత, స్థానిక ప్రజలకు వివిధ చట్టాలపై వివరణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు చట్టపరమైన విషయాలపై తగినంత అవగాహన లేక అనేక సమస్యలకు గురవుతున్నారని ఆమె పేర్కొన్నారు.

రైతులు, కార్మికులకు సూచనలు వ్యవసాయ కార్మికులు తమ కూలీలు, కార్మిక హక్కులు, వేతనాలు, భద్రత వంటి అంశాలకు సంబంధించిన చట్టాలను తప్పకుండా తెలుసుకోవాలని




న్యాయమూర్తి సూచించారు. తమకు అన్యాయం జరిగినప్పుడు మౌనంగా ఉండకూడదని, సంబంధిత అధికారుల ద్వారా లేదా న్యాయసేవా కేంద్రాల ద్వారా న్యాయం కోరాలని ఆమె అన్నారు. భూమి రికార్డులు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, భూ వివరాలను ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారుల ద్వారా తనిఖీ చేయించుకోవాలని కూడా సలహా ఇచ్చారు. దీనివల్ల భూ వివాదాలు, మోసాలు నివారించవచ్చని వివరించారు. నేటి ఆధునిక సమాజంలో కొన్ని వర్గాల వారు వృద్ధుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని, ఇది ఆమోద యోగ్యం కాదని న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లలను పెంచి పెద్ద చేసిన బాధ్యతను గుర్తుంచుకుని, వారి వయోజన జీవితంలో వారికి అవసరమైన ఆర్థిక, శారీరక, మానసిక సహాయం అందించాలని అన్నారు. వృద్ధులకు వయసు ప్రకారం అవసరమైన ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలని, వారి ఆరోగ్యాన్ని పట్టించుకోవాలని పిల్లలకు సూచించారు. చిన్న పిల్లలకు వివాహం చేయడం చట్ట రీత్యా నేరమని, న్యాయమూర్తి స్పష్టంగా చెప్పారు. చట్టం తెలిసినా కొన్ని చోట్ల ఇంకా బాల్యవివాహాలు జరుగుతున్నాయని, ఇది బాలికల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బాల్యవివాహం చేసుకున్న వారితో పాటు, అలాంటి వివాహాలను చేయించిన తల్లిదండ్రులు, బంధువులు, పూజారులు, ఇతర సహకరించిన వారిపై కూడా చట్టపరమైన చర్య తప్పదని హెచ్చరించారు. బాల్యవివాహాలను గమనించిన వెంటనే పోలీసులకు లేదా మహిళా సంక్షేమ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే, ప్రజలు తమ హక్కులను తెలుసుకుని, అన్యాయాలను ఎదుర్కోగలరని న్యాయమూర్తి అన్నారు. వివాహం, భూమి, కుటుంబ వివాదాలు, మహిళల భద్రత, బాల్యవివాహాలు, వృద్ధుల సంరక్షణ వంటి అంశాలపై గ్రామస్థులకు ఈ సదస్సు ద్వారా అవగాహన కల్పించారు. అవసరమైనప్పుడు న్యాయ సేవా కేంద్రాల ద్వారా ఉచిత న్యాయ సలహా అందుబాటులో ఉందని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి, ఏఎస్ఐ సంగప్ప, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ రకమైన న్యాయ విజ్ఞాన సదస్సులు గ్రామీణ ప్రాంతాల్లో చట్టపరిజ్ఞానాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

- **చెరువులు, నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్ల పరిశీలన**
- **మహిళలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి: మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. పండుగకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ కౌన్సిలర్లు, కమిషనర్, వార్డు అధికారులతో కలిసి గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం, వీరన్నగూడెం గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రాంగణాలను, నిమజ్జనం చేసే చెరువుల ఘాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి, అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా చెరువుల వద్ద నిమజ్జన ఘాట్లను సిద్ధం చేయడంతో పాటు, తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెరువుల వద్ద భద్రతా చర్యలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. పండుగకు ముందే అన్ని ఏర్పాట్లు



పూర్తి చేసి, బతుకమ్మ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ సూచించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. పారిశ్రామిక వాడలో నేడి సద్దుల బతుకమ్మ గుమ్మడిదల మున్సిపాలిటీ తో పాటు మండలంలో సద్దుల బతుకమ్మ పండుగను ఆదివారం నిర్వహిస్తున్నారు. బతుకమ్మ నిర్వహించే ప్రాంతాలతో పాటు నిమజ్జనం చేసే చెరువుల వద్ద అన్ని రకాల చర్యలను మున్సిపల్ శాఖ అధికారులతో పాటు మండల లోని గ్రామాల సర్పంచులు తగు చర్యలు చేపట్టారు.

# రామచంద్రారెడ్డి నగర్‌లో సద్దుల బతుకమ్మ సంబరాలు

- **రామసముద్రం చెరువు వద్ద గంగా హారతి, బతుకమ్మ నిమజ్జనం**

**రామచంద్రపురం, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

రామచంద్రరెడ్డి నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించనున్నారు. సంఘం అధ్యక్షుడు వెన్నవరం మల్లారెడ్డి నేతృత్వంలో జరిగే ఈ వేడుకలు సాయంత్రం 5.30 గంటలకు రామచంద్రరెడ్డి గణేష్ మండపం వద్ద ప్రారంభం కానున్నాయి. అనంతరం సాయంత్రం 7.30 గంటల నుంచి రామసముద్రం చెరువు వద్ద ఉన్న బతుకమ్మ ఘాట్‌లో కాశీ పండితులచే గంగా హారతి నిర్వహించనున్నారు. అనంతరం బతుకమ్మ నిమజ్జన కార్యక్రమం జరగనుంది. వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలను సిరి టీవీ లైవ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.





# కొల్చారం పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛత కార్యక్రమం




- **పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలి: ఎస్సై మొహీనుద్దీన్**

**కొల్చారం, అక్టోబర్ 17 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మహమ్మద్ మొహీనుద్దీన్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించగలమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలని కొల్చారం ఎస్సై పిలుపునిచ్చారు.

# లక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు

**తూప్రాన్ అక్టోబర్ 17 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 10 వ వార్డు వెంకటాపూర్ వెంకటా పట్నంలో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం వద్ద వెలిసినటువంటి శ్రీ శ్రీ శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నవరాత్రులలో భాగంగా శనివారం రోజు శ్రీ మహా లక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన గుడి ప్రధాన పూజారి రవి పంతులు నర్సారెడ్డిని శాలువాతో సన్మానించారు అమ్మవారి సన్నిధానంలో భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు




# విద్యుత్ నగర్‌లో ఘనంగా 24వ శరన్నవరాత్రి ఉత్సవాలు



- **చండీ హోమం, అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు**

**రామచంద్రాపురం, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

భారతి నగర్ డివిజన్ విద్యుత్ నగర్‌లో శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 24వ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ సరితా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చండీ హోమం, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. కాశీ సుదర్శన దండి స్వామీజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చండీ హోమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో సాగడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మురళి, శివకుమార్, యు.రవి, ప్రవీణ్, శ్రీనివాస్, విశాల్ వర్మ, సాయి ఆదర్శ్, ఫణిందర్, సతీష్, సంతోష్, రాజేష్ చారి, మణికంఠ, సాకేత్, పవన్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ సరస్వతిమాతగా అమ్మవారు

**సదాశివపేట. అక్టోబర్ 17. (సిరి-న్యూస్)**

సదాశివపేట లోని శ్రీ కన్యక పరమేశ్వరి మందిరంలో శరన్నవరాత్రులలో భాగంగా శనివారం నాడు సరస్వతి దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. శ్రీ కన్యక పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన, లలిత సహస్రనామములు, మధ్యాహ్నం హారతి, పాల్గొన్న భక్తులందరికీ మహా ప్రసాదం వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.



# కూరగాయ పంటల సాగు బాగుంది



**తూప్రాన్ అక్టోబర్ 17 సిటీ న్యూస్**

తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో కూరగాయల పంటల సాగు అద్భుతంగా ఉందన్నారు శనివారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ గ్రామంలో కూరగాయల పంటల సాగును సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ తో కలిసి పరిశీలించారు గ్రామానికి చెందిన రైతులు మామిళ్ళ స్వామి కిష్టా స్వామి పందిరి సాగుకు 1,50,000 వేల సబ్సిడీ మంజూరైనట్లు ప్రతాప్ సింగ్ తెలిపారు కూరగాయల పంటల సాగుతో రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు ఉద్యానవన శాఖ ద్వారా రైతులను ప్రోత్సహించడానికి పందిరి సాగుకు 50 శాతం సబ్సిడీ అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో మండల అధికారి రచన ఉప సర్పంచ్ స్వామి కోఆర్డినేటర్ గోవిందులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై సమీక్ష




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

శేరిలింగంపల్లి జోనల్ మున్సిపల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ్ ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లు, ప్రజల అభిప్రాయాల సేకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావుతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి మియాపూర్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. ఓటర్లు ఇంట్లో లేకపోవడం, చిరునామాలు మారడం, వలస వెళ్లినవారికి నోటీసులు అందకపోవడం, మరణించిన వారి పేర్లు జాబితాలో కొనసాగడం, పేర్లు, వయస్సు, చిరునామాల్లో తప్పులు, అవసరమైన పత్రాలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం6 అందుబాటులో ఉంచాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో పని చేయాలని ఉప్పలపాటి శ్రీకాంత్ కోరారు.

# నేతాజీ యువజన సంఘము ఆధ్వర్యంలో చండీ హోమం



- **అంగరంగ వైభవంగా సాగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు**
- **తీరొక్క మొక్కులు చెల్లించుకుంటున్న భక్తజనం**

**వెల్దుర్తి,అక్టోబర్ 17, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం కుకునూరు గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడవ రోజు శనివారం సప్తమి పురస్కరించుకొని దుర్గామాతను శ్రీ లలితాత్రిపురసుందరి దేవి రూపంలో, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. దుర్గామాత సేవకులు వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అమ్మ దర్శనం కల్పించారు. నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా చండీ హోమం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదన కల్పించారు. అనంతరం గ్రామస్తులు అందరూ కలిసి చండీ హోమంలో పాల్గొన్నారు.

# ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటే పూల వేడుక బతుకమ్మ

- **కమిషనర్ శివాజీ.**

**సదాశివపేట. అక్టోబర్ 17. (సిరిన్యూస్)**

సదాశివపేటలోని ఊబ చెరువు వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సందర్భంగా సదాశివపేటలోని మహిళలు బతుకమ్మ ఆడటానికై ఏర్పాట్లను చేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శివాజీ మాట్లాడుతూ బతుకమ్మ ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఆడపిల్లల ఆత్మగౌరవాన్ని చాటే పూల వేడుక బతుకమ్మ పండుగ అని అన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా మున్సిపాలిటీ తరపున చైర్పర్సన్, వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు ఊబ చెరువు వద్ద ఏర్పాట్లను చేయడంలో వారి కృషి ఎంతగానో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షఫ్జీ, ఉల్లిగడ్డల ఉమారాణి నాగరాజు, కోఆప్షన్ సభ్యులు మునిపల్లి సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- **మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు**
- **బతుకమ్మలతో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు**



**గుమ్మడిదల, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా, సంతోషంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ రాష్ట్ర సంస్కృతీ వైభవాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ పరమేశం, ఎంపీడీఓ ఉమాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా వార్డు కౌన్సిలర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతుందని అన్నారు.

తరతరాలుగా వస్తున్న ఈ పండుగను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పండుగ విశిష్టతను చాటాలని ఆకాంక్షించారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి సందడిగా వేడుకలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఆకుల మాధవి, పద్మ, సోనీ, మహిళలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాలే ప్రాధాన్యం అభివృద్ధి పనులే లక్ష్యం

- **11వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

ప్రజల అవసరాలకు అనుగుణంగా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత నిస్తూ ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. శనివారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ వార్డు కౌన్సిలర్లు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా పనుల
పురోగతిని అధికారులను, సంబంధిత వర్గాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, రహదారులు ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే రహదారి సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యతకు పెద్దపీట వేస్తూ,



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, అవసరాలను పరిగణనలోకి తీసుకొని మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు కత్తుల రమేష్, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, దాసరి అంజనేయులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఆదర్శ్ రెడ్డి

- **పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు..**
- **అన్నదానంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఇన్‌చార్జ్**



**రామచంద్రపురం, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీరంగూడ డివిజన్ మాజీ కౌన్సిలర్ ప్రమోద్ రెడ్డి ఆహ్వానం మేరకు అక్కడ జరిగిన ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం భారతి నగర్ డివిజన్ పరిధిలోని సిరికి ఆఫీస్, ఎఫ్ పార్క్, నేతాజీ ఫంక్షన్ హాల్, ఓల్డ్ ఎంఐజీ బి పార్క్‌లలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఓల్డ్ ఎంఐజీ బి పార్క్‌లో జరిగిన అన్నదాన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ దేవి నవరాత్రులు అమ్మవారి శక్తి, వైభవానికి ప్రతీకలని అన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావం, ఐక్యతను పెంపొందించడంతో పాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వాహకులకు, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పెద్ద చెరువు సాక్షిగా ఆధ్యాత్మిక శోభ

- **శోభాయాత్రకు సర్వం సిద్ధం**
- **శోభాయాత్రకు ముఖ్య అతిథిగా హరీష్ రావు**
- **ఆహ్వానించిన తుమ్మల పాండురంగారెడ్డి**

**అమీన్పూర్ అక్టోబర్ 17 సిరి న్యూస్**

అమీన్పూర్ పెద్ద చెరువు వద్ద ఈనెల 22న అమ్మవారి శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరు కావాల్సిందిగా మాజీ మంత్రి హరీష్ రావు ను నిర్వాహకులు ప్రముఖ నాయకులు తుమ్మల పాండురంగారెడ్డి స్వయంగా ఆహ్వానించారు. ఈ శోభాయాత్రను విజయవంతం చేసేందుకు స్థానిక భక్తులు మరియు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. అమీన్పూర్ పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలు వెల్లివెరిసెల అమ్మవారి శోభాయాత్రను ఎంతో కనుల పండుగ నిర్వహిస్తున్నామని తెలిపారు. కులమత రాజకీయ వివాదాలకు అతీతంగా ప్రజలంతా ఈ శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మన ప్రాంతంపై



ఎంతో అభిమానంతో ఆహ్వానాన్ని మన్నించి హాజరవుతున్న మాజీ మంత్రి హరీష్ రావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అమీన్పూర్ ప్రజలందరికీ అమ్మవారి దివ్య ఆశీస్సులు లభించి నియోజకవర్గ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన పేర్కొన్నారు.

# బీహెచ్ఈఎల్‌లో భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజలు

- **ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు**



**రామచంద్రాపురం, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామచంద్రాపురంలోని బీహెచ్ఈఎల్ హెచ్‌పీఈపీ యూనిట్‌లో శనివారం ఆయుధ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంస్థలోని ఉత్పత్తి విభాగాలు, పని కేంద్రాలు, టౌన్‌షిప్ ఎస్టేట్ కార్యాలయం, జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు యంత్రాలు, పనిముట్లను శుభ్రపరిచి విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారికి పూజలు నిర్వహించి, తమ జీవనోపాధికి ఆధారమైన యంత్రాలు, పనిముట్ల పట్ల కృతజ్ఞతను చాటుకున్నారు. హెచ్‌పీఈపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. సుబ్రమణ్యం వివిధ పూజా ప్రదేశాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సంస్థ అభివృద్ధి, ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమం, భద్రత, సుభిక్షత కోసం అమ్మవారిని ప్రార్థించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరికీ సుఖసంతోషాలు, విజయాలు, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు సైతం పూజల్లో పాల్గొని వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

# పటాన్‌చెరు సర్కిల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**రామచంద్రపురం, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పటాన్‌చెరు సర్కిల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు సందడిగా సాగాయి. పటాన్‌చెరు సర్కిల్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ కే. కావ్యతో పాటు కార్యాలయ సిబ్బంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం కార్యాలయంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది.



# దోమడుగులో భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి హోమం

- దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: కాటా సుధా శ్రీనివాస్ గౌడ్
- భక్తులకు మహా అన్నప్రసాద వితరణ:మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు

**గుమ్మడిదల, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**



దుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో దీవించాలని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన మహాలక్ష్మి హోమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దోమడుగు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా దేవి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలను ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు గ్రామంలో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి దీవెనలు గుమ్మడిదల మున్సిపాలిటీ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ దుర్గమ్మ అమ్మవారు మున్సిపాలిటీ ప్రజలందరినీ చల్లగా చూడాలని, ప్రజల శ్రేయస్సు, గ్రామ అభివృద్ధి, కుటుంబాల సంతోషం కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశం, ఎస్ఐ అరుణ్ కుమార్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగ్ రావు, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, వీరభద్రస్వామి దేవాలయ కమిటీ మాజీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, నాయకులు మద్ది వీరారెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు అభిశెట్టి రాజశేఖర్, మద్ది సోనీ శేఖర్ రెడ్డి, బ్యాగరి వరలక్ష్మి కృష్ణ, సురభి కుమార్ గౌడ్, కత్తుల రమేష్, తులసీదాస్, మంగయ్య, వెంకట్రాం రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, తుపాకుల రాజు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల పండుగ బతుకమ్మ



- 7వవార్డు కౌన్సిలర్ అనిత విష్ణువర్ధన్ రెడ్డి.

**సదాశివపేట. అక్టోబర్ 17. (సిరిన్యూస్)**

బతుకమ్మ పండుగ సందర్భంగా 7వ వార్డు కౌన్సిలర్ అనిత విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళలకు అతిముఖ్యమైనదని, వార్డులోని మహిళలు బతుకమ్మకు పూజాలు నిర్వహించి అనంతరం బతుకమ్మ పాటలతో, కోలాటాలతో బతుకమ్మ పండుగ కనువిందుగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టారెడ్డి, నాగిరెడ్డి, అనంతరం గౌడ్, లక్ష్మయ్య, మచ్చేందర్, మంగలి చందు, గొల్ల రవి, సింహాచారి, బంజా శంభు, జంగం ముట్టి, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కన్నాలలో భక్తి వైభవం..



- భవానీ స్వాములకు ఘన వీడ్కోలు..
- బంగారు మైసమ్మ ఆలయం నుంచి మాల విరమణకు బయలుదేరిన స్వాములు..
- కొబ్బరికాయ కొట్టి సాగనంపిన నాతరి స్వామి..
- భక్తుల సుఖసంతోషాల కోసం దుర్గామాతకు ప్రార్థనలు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 17 (సిరి న్యూస్)**

బెల్లంపల్లి నియోజకవర్గం కన్నాల గ్రామంలో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. దుర్గామాత మాల విరమణకు బయలుదేరిన భవానీ స్వాములకు కాంగ్రెస్ నాయకులు ఘనంగా వీడ్కోలు పలకడంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని బంగారు మైసమ్మ ఆలయం నుంచి భవానీ స్వాములు మాల విరమణ కార్యక్రమానికి బయలుదేరిన సందర్భంగా ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ సాగింది. ఈ సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి పాల్గొని కొబ్బరికాయ కొట్టి భవానీ స్వాములను సాగనంపారు. అమ్మవారిపై భక్తితో దీక్ష చేపట్టిన భక్తులకు దుర్గామాత అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. భవానీ భక్తుల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ప్రశాంతతతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. భక్తి, విశ్వాసం, ఆధ్యాత్మిక చింతనతో సాగిన ఈ కార్యక్రమం భక్తులలో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరికీ మేలు జరగాలని, సమాజంలో సుఖశాంతులు వెల్లివిరియాలని నాతరి స్వామి ఆకాంక్షించారు. భవానీ స్వాములకు వీడ్కోలు పలికిన ఈ కార్యక్రమం కన్నాల గ్రామంలో భక్తిభావాన్ని చాటిచెప్పింది.

# విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



- పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేక పూజలు

**పటాన్ చెరు, అక్టోబర్ 17, (సిరి న్యూస్):**

పట్టణంలోని శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం ఆరవ వార్షికోత్సవం పురస్కరించుకొని శనివారం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ విశ్వ బ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. దేవాలయం అభివృద్ధికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, దయానంద్ చారి, వెంకటేష్, రాజు, రామ్మోహన్, విశ్వకర్మ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# బంతి పూలకు భలే గిరాకీ!



- సద్దుల బతుకమ్మకు రంగురంగుల పూలతో ముస్తాబు
- పండుగ వేళ పూల మార్కెట్లలో సందడి

**గుమ్మడిదల, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ తుది ఘట్టానికి చేరుకోవడంతో మార్కెట్లలో సందడి నెలకొంది. ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు మండల పరిధిలోని గ్రామాల మహిళలు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో బతుకమ్మలను అందంగా పేర్చేందుకు అవసరమైన పూలకు డిమాండ్ పెరగడంతో బంతి పూలకు భలే గిరాకీ ఏర్పడింది. బతుకమ్మ పండుగలో పూలదే ప్రత్యేక స్థానం. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను సేకరించి వాటిని వరుసలుగా, రంగుల సమ్మేళనంతో అందంగా పేర్చి బతుకమ్మలను తయారు చేస్తారు. ముఖ్యంగా తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. అనంతరం సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ వలయాకారంగా చేరి జానపద పాటలు పాడుతూ, చప్పట్లతో ఆటలాడుతూ సంబరాలు జరుపుకుంటారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా పూల కొనుగోళ్లకు ప్రాధాన్యం పెరిగింది. బతుకమ్మలను అందంగా అలంకరించేందుకు బంతి పూలను ఎక్కువగా వినియోగిస్తుండటంతో వ్యాపారులు వివిధ రంగుల్లోని పూలను విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతంలోనూ పూల వ్యాపారులు బంతి పూలను అందుబాటులో ఉంచి అమ్మకాలు సాగిస్తున్నారు. పండుగ కోసం అవసరమైన పూలను కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపుతుండటంతో పూల విక్రయాలు ఊపందుకున్నాయి. పల్లెల్లో పూల సేకరణ నుంచి పట్టణాల్లో పూల కొనుగోళ్ల వరకు బతుకమ్మ పండుగ సందడి కనిపిస్తోంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మహిళలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి



- దుర్గామాత ప్రత్యేక పూజల్లో చంద్రారెడ్డి

**జిన్నారం అక్టోబర్ 17 సిరి న్యూస్**

బొల్లారం డివిజన్ పరిధిలోని వెంకటరెడ్డి నగర్ కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానికులు ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.చంద్రారెడ్డి, కార్మిక రాష్ట్ర నాయకులు వి.వరప్రసాద్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దుర్గామాత'కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులతో కలిసి భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని వితరణ చేశారు. నిర్వాహకులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రమణయ్య, వెంకటేష్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, నాగి రెడ్డి, వెంకట్, కృష్ణ, సాయి, సురేష్, సుబ్బు, ఆశిష్, ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- కార్మికులే నా కుటుంబం
- పారిశుద్ధ్య ' జలమండలి సిబ్బందికి బట్టల అందజేత
- మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం
- నరసింహ గౌడ్

**అమీన్పూర్ అక్టోబర్ 17 సిరి న్యూస్**



పారిశుద్ధ్య హెచ్ ఎం డబ్ల్యు ఎస్ కార్మికులకు దసరా సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేసిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బీరంగూడ డివిజన్లో శనివారం పట్టణ సుందరీ కరణ, ప్రజారోగ్య రక్షణకు, మరియు తాగునీటి సరఫరకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ కార్మికులు జలమండలి బోర్డు కార్మికుల సేవలు ఎంతో అభినందనీయమని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో ప్రతి ఒక్కరూ శుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యంగా ఉండటానికి రాత్రింబవళ్లు కష్టపడేది పారిశుద్ధ్య కార్మికులేనని కొనియాడారు. అలాగే ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తూ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంలో జలమండలి సిబ్బంది పాత్ర కీలకమైనదని ఆయన తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ కూడా వీరు అందిస్తున్న సేవలను గుర్తించి వారి శ్రమకు గౌరవంగా ఈ నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. కార్మికుల సంక్షేమానికి వారి కష్టసుఖాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# గీతం జాతీయ ఏఐ ఛాలెంజ్–2026

- రూ.20 లక్షల నగదు బహుమతులు.. విజేతకు రూ.9 లక్షలు

**పటాన్‌చెరు, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

విద్యార్థుల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయి ఏఐ ఛాలెంజ్-2026ను ప్రకటించింది. దేశవ్యాప్తంగా 11, 12 తరగతులతో పాటు డిగ్రీ విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చు. మొత్తం రూ.20 లక్షల నగదు బహుమతులు అందించనున్నారు. నిజ జీవిత సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడమే ఈ పోటీ లక్ష్యం. విద్యార్థులు వ్యక్తిగతంగా లేదా గరిష్ఠంగా నలుగురు సభ్యులతో కూడిన బృందాలుగా పాల్గొనవచ్చు. తొలుత ఆన్‌లైన్‌లో తమ ఆలోచనలు, నమూనాలను ఐదు స్లైడ్ల ప్రజెంటేషన్ ద్వారా సమర్పించాలి. పోటీలో భాగంగా టాప్ 200 జట్లకు ఆన్‌లైన్ క్వార్టర్ ఫైనల్స్, టాప్ 100 జట్లకు గీతం ప్రాంగణంలో సెమీ ఫైనల్స్, టాప్ 20 జట్లకు గ్రాండ్ ఫైనల్ నిర్వహించనున్నారు. విజేత జట్టుకు రూ.9 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ.6 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.3 లక్షలు అందజేయనున్నారు. మరో రెండు రన్నరప్ జట్లకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు పురస్కారాలు ఇవ్వనున్నారు. పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేయనున్నారు. ఈ పోటీ యువతలో సృజనాత్మకత, సాంకేతిక ఆవిష్కరణలు, వ్యవస్థాపక ఆలోచనా విధానాన్ని పెంపొందించనుంది.

# దుర్గమ్మ ఆలయంలో భక్తులకు అన్నదానం

- దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు

**గుమ్మడిదల, అక్టోబర్ 17 (సిరి న్యూస్):**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో శనివారం దుర్గమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తున్నారు. మహిళలు సైతం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షిస్తూ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామస్తులు, యువకులు, మహిళలు, దుర్గమ్మ మాల ధారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



# ఖేడ్ అభివృద్ధి పనులకు రూ.45 కోట్ల నిధుల మంజూరు

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్ద శంకరం పేట, అక్టోబర్ 17, (సిరి న్యూస్):**



నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. శనివారం నాడు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్ డిగ్రీ కళాశాల వెనుక రూ.5 కోట్లతో ఇండోర్, ఔట్ డోర్ స్టేడియం నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయని, తదుపరి విడతలో మరో రూ.5 కోట్లు కేటాయించేందుకు కృషి చేస్తామని చెప్పారు. బోరంచలో ఎకో కాటేజీలకు రూ.2 కోట్లు, బోటింగ్‌కు రూ.2 కోట్లు మంజూరయ్యాయని, కమలాపూర్ చెరువును మినీ ట్యాంక్‌బండ్ గా అభివృద్ధి చేసేందుకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. బంజారా భవన్‌కు రూ.2 కోట్లు, ఎస్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.1.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆర్డీవో, తహసీల్దార్, క్యాంప్ కార్యాలయాల సముదాయానికి రూ.12.5 కోట్లు మంజూరై టెండర్ దశలో ఉందన్నారు. మహిళల ఉపాధి కోసం సెట్విన్ కేంద్రం, నిజాంపేటలో రూ.10 కోట్లతో ఆధునిక పాఠశాల, మనూరు మండలంలో విద్యాసంస్థ ఏర్పాటు, అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ వంటి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.

# లలితా త్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన దుర్గమ్మ

**పాపన్నపేట, అక్టోబర్ 17 సిరి న్యూస్:**



ఏడుపాయల శ్రీ వనదుర్గాభవానీ అమ్మవారి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు లలితా త్రిపురసుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

# బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

- చెరువు, ఘాట్ల వద్ద ముమ్మర చర్యలు

**వెల్దుర్తి,అక్టోబర్ 17, (సిరి న్యూస్ ):**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను వెల్దుర్తి మండలం ఏదులపల్లి పరిధిలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా చేశామని సర్పంచ్ చందన శ్రీనివాస్ తెలిపారు.గ్రామం లో బతుకమ్మ ఆడే ప్రాంగణాలు, నిమజ్జనం చేసే చెరువు ఘాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల వద్ద నిమజ్జన ఘాట్ల ఏర్పాట్లు, లైటింగ్, పరిశుభ్రత పనులను సమీక్షించారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏర్పాట్లలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా పండుగకు ముందే అన్ని పనులు పూర్తి చేశారని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో గ్రామస్తులు, తదితరులు పాల్గొనారు.

# మండలానికి దక్కిన అరుదైన గౌరవం



- ఆరేపల్లి బిడ్డకు మూడో బహుమతి

**పాపన్నపేట, అక్టోబర్ 17 సిరి న్యూస్:**

తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన బతుకమ్మ పాటల పోటీల్లో పాపన్నపేట మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన దొడ్లే మనీషా పాటిల్ ప్రతిభ చాటారు. ఆమె స్వయంగా దర్శకత్వం వహించి నటించిన 'బుజ్జి బతుకమ్మ' పాటకు రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి లభించింది. ఈ ఘనతతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. గ్రామ సర్పంచ్ రజిత రాజశేఖర్, గ్రామ ప్రజలు మనీషా పాటిల్ ను ఘనంగా అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటే బతుకమ్మ పాటకు రాష్ట్రస్థాయి గుర్తింపు రావడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

# గ్రామ పారిశుద్ధ్యంలో పంచాయతీ సిబ్బందిదే కీలక పాత్ర

- పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ
- విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కార్యక్రమం

**గుమ్మడిదల, అక్టోబర్ 17(సిరి న్యూస్):**

గ్రామ పారిశుద్ధ్యంలో పంచాయతీ సిబ్బందిదే కీలక పాత్రని కానుకుంట సర్పంచ్ పెంటా రెడ్డి అన్నారు. శనివారం గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట గ్రామంలో విజయదశమి పండుగను పురస్కరించుకుని గ్రామపంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. పండుగల సందర్భంగా సిబ్బందితో ఆత్మీయతను పంచుకోవడం, వారిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్ గౌడ్, ఉపసర్పంచ్ పాషా, కుమ్మరి పెంటేష్, ఎల్లబోయిన భవాని, ప్రేమ్ దాస్,



చౌదరి శ్రీకాంత్ రెడ్డి, ఎలబోయిన నాగరాజు, పుర్ర శ్యామల సురేష్, రావుల మహేష్, ఇప్పా లక్ష్మీనరసింహారెడ్డి, జుర్రు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయ ధ్వజస్థంభ ప్రతిష్ఠకు రూ.50 వేలు విరాళం..

- ధ్వజస్థంభ ప్రతిష్ఠకు వచ్చిన భక్తులకు అన్నదానం..
- ప్రముఖ సంఘ సేవకులు తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా..

**శివంపేట్ అక్టోబర్ 17 ( సిరి న్యూస్ )**



శివంపేట గ్రామంలోని పురాతన పుణ్యక్షేత్రమైన శ్రీ రామాలయం అభివృద్ధికి తాజా మాజీ జడ్పీటీసీ, ప్రముఖ సంఘసేవకులు పబ్బ మహేష్ గుప్తా తన వంతు సహకారం అందించారు. ఆలయంలో ధ్వజస్థంభం ఏర్పాటు కోసం తన సొంత నిధుల నుంచి రూ.50 వేల విరాళాన్ని అందజేసి భక్తి, సేవాభావాన్ని చాటుకున్నారు. ఆలయ అభివృద్ధికి ముందుకొచ్చిన మహేష్ గుప్తా, ధ్వజస్థంభ ప్రతిష్ఠ కార్యక్రమానికి కూడా తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. శివంపేట గ్రామంలోని పురాతన రామాలయంలో ధ్వజస్థంభం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ముందుకొచ్చిన పబ్బ మహేష్ గుప్తా..రూ.50 వేల నగదును ఆలయ పూజారి శాస్త్రుల రాజశేఖర్ శర్మకు అందజేశారు. ధార్మిక కార్యక్రమాలకు, గ్రామంలోని ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు ఆయన చాటుకున్నారు. అంతేకాకుండా ధ్వజస్థంభ ప్రతిష్ఠ జరిగే రోజున ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని సైతం నిర్వహిస్తానని మహేష్ గుప్తా ప్రకటించారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందనే విధంగా తన సేవా కార్యక్రమాల ద్వారా ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు, ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా జీవితంలో ఉంటూ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తున్న పబ్బ మహేష్ గుప్తా సహకారంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ ఇసుగారి మల్లేష్, వార్డు సభ్యులు ముయడ్డి ముత్యాలు, కొవ్వూరి యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షుడు ముద్దగాళ్ల లక్ష్మి నరసయ్య, మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు బాసంపల్లి పోచ గౌడ్, మగ్దుంపూర్ సర్పంచ్ సోము అశోక్, పిఎంజి యువసేన సభ్యులు కొత్తపేట శ్రీనివాస్ గౌడ్, సోముసాని రేవంత్, పత్రాల త్రినేష్ గౌడ్, కల్లూరి రాజు, బాలాపురం సురేష్, సాదక్, క్యాసని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# బతుకమ్మ వేడుకలో వైస్ చైర్పర్సన్ రేణుక చిరు



**సదాశివపేట. అక్టోబర్ 17. (సిరిన్యూస్)**

బతుకమ్మ పండుగ సందర్భంగా సదాశివపేటలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రేణుక చిరు గృహం వద్ద వార్డులోని మహిళలతో పాటు బతుకమ్మకు పూజలు నిర్వహించి, బతుకమ్మ పాటలతో, కోలాటాలతో బతుకమ్మ ఆడటం జరిగింది. ఈ సందర్భంగా వైస్ చైర్పర్సన్ రేణుక చిరు మాట్లాడుతూ బతుకమ్మకు పూజలు నిర్వహించి, బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పండుగ మహిళలకు ప్రత్యేకమైనదన్నారు. అనంతరం బతుకమ్మలను ఉబ చెరువులో నిమజ్జనం చేయడం జరిగింది.

# దుర్గమ్మ నవరాత్రుల సందర్భంగా ఘనంగా బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**కొల్చారం అక్టోబర్ 17 (సిరి న్యూస్)**



మెదక్ జిల్లా కొల్చల్ మండల కేంద్రంలో వీరభద్ర ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలను తలపై ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. గ్రామ ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం గ్రామం ఉప సర్పంచ్ కోరంపల్లి రాణి కవిత సబిత నాగరాణి జ్యోతి వీరమణి లక్ష్మి మరియు గ్రామ మహిళలు, భక్తులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మే అసలైన ప్రతీక

- ప్రకృతిని, పూలను ఆరాధించే అరుదైన పండుగ
- నిర్మలా జగ్గారెడ్డి
- బతుకమ్మ వేడుకల్లో బతుకమ్మ ఆడిపాడిన నిర్మల

**సంగారెడ్డి అక్టోబర్ 17 (సిరి న్యూస్):**



తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, అచార సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ సజీవ ప్రతీకగా నిలుస్తుందని ప్రముఖ నాయకురాలు నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు.దేవీ నవరాత్రుల వేడుకలను పురస్కరించుకుని సంగారెడ్డి కలెక్టరేట్ మరియు సదాశివపేటలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సంగారెడ్డి కలెక్టరేట్‌లో అన్ని శాఖల ఉద్యోగులు మరియు తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అత్యంత వైభవంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, మహిళా ఉద్యోగులు సంప్రదాయ పాటలకు అనుగుణంగా చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. ఈ వేడుకల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు అక్కడివారందరిలోనూ ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత, డీఎంహెచ్ఓ డాక్టర్ లలితా దేవిలతో పాటు కలెక్టరేట్ లోని వివిధ శాఖల మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మరోవైపు సదాశివపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానికంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లోనూ నిర్మలా జగ్గారెడ్డి ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిని, పువ్వులను, నీటి వనరులను పూజించే అరుదైన సంస్కృతి మన తెలంగాణ సొంతమని, అలాంటి గొప్ప సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పండగ ఏదైనా అందరూ కలిసిమెలిసి ఆనందంగా జరుపుకోవడం మన సాంప్రదాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుకా చిరు, పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బిజెపి పార్టీలో చేరికలు

- రామచంద్రాపురం గ్రామం ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్ చేరికలు
- గ్రామ అభివృద్ధికి పార్టీల అతీతంగా కృషి చేయాలి
- ఎంపీ రఘునందన్ రావు

**నర్సాపూర్ అక్టోబర్ 17 (సిరి న్యూస్)**



నర్సాపూర్ మండలం రామచంద్రపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు యువకులు బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు . ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెడుతున్న పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరుతున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు గ్రామంలో అంగన్వాడీ భవనం, మహిళా సమైక్య భవనం, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించుకోవడానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మన ఊరు మనబడి పథకానికి సంబంధించిన బిల్లులు రాలేదని భయపడవద్దని, ఈ రూ.40 లక్షల నిధులు వీబీజీ రాంజీ నుంచి నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పార్టీల జెండాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న వీబీజీ రాంజీ నిధులను కరెంట్ బిల్లులు తదితర వాటికి చెల్లించాలని ప్రభుత్వం తీసుకురావడం దురదృష్టకరమన్నారు. రేవంత్ రెడ్డి యాసంగి పంటలు వేయవద్దని చెప్పడం. రైతులను కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని కరెంట్ కోతలతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులు రోడ్ల ఆందోళన చేస్తున్నారు. రేవంత్ రెడ్డి 12 గంటల కరెంట్ నిరంతరాయంగా నెల రోజులపాటు అందిస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. బీజేపీ రైతుల తరఫున ఉంటుందని కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు నీలి నగేష్ ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్ సర్పంచ్ గీత నరేందర్, గ్రామ బూత్ కమిటీ అధ్యక్షుడు హరిహర గౌడ్, బీజేపీ నాయకులు అంజి గౌడ్, ప్రేమ్ కుమార్, రమేష్ గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.